# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 29-9-2026   NETI NIZAM Telugu Daily,   RNI No.52865/93   Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33   సంచిక:50 పేజీలు:6   వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

తొలిసారిగ మోడీ "ద్యూ
యలు ఫ్యూయలు " వాడగలుగు యంత్రచయంబున్
పలు విలువలు రైల్వేలో
వెలయించుటకై ప్రవేశ పెట్టెను విదుదై !!

(ప్రధాని మోడీ గారు దూరదృష్టితో రైల్వే లో డ్యూయల్ ఫ్యూయల్ యంత్రాలను ప్రవేశపెడుతున్నారు. దీని వలన రైల్వే కు ఎంతో ఆదా అవుతుంది ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

లనిత్యం ఎటుచూసినా
నినాదాల హోరు
వినిపించదు ఏపార్టీలో
విధానాల జోరు.
అన్నిటిలో అధినేతలు
హామీల మాంత్రికులే
అమలులోనే ఆడితప్పే
అద్భుతాల తాంత్రికులే



-వేల్పుల నారాయణ
9440433475

# థాయ్‌లాండ్‌ను ముంచెత్తిన వరదలు



## నీటిలోనే థాయ్ రాజధాని
## 41 ప్రావిన్సుల్లో వరద బీభత్సం
# 8 మంది మృతి
## 80000 మంది .జలదిగ్బంధనం
## రూ. 2,700 కోట్లకు పైగా నష్టం..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌ను వరదలు ముంచెత్తాయి. వారాంతంలో కురిసిన భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల నడుములోతు నీటిలోనే ప్రజలు నిత్యావసరాల కోసం బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయి సహాయక శిబిరాల్లో తలదాచుకున్నారు. గత వారం రెండు, మూడు రోజుల్లోనే బ్యాంకాక్‌లో సుమారు 320 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో నగరంలోని డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ఉక్కిరిబిక్కిరైంది. పలు నివాస ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది.

వరద తీవ్రత ప్రజల రోజువారీ జీవితాన్ని అతలాకుతలం చేసింది."సమయానికి సిద్ధం కాలేకపోయాం. ఇప్పుడు ఇంట్లో తినడానికి ఆహారం కూడా లేదు" అని 60 ఏళ్ల బాంగోర్న్ డెడ్‌నుయామ్ ఆవేదన వ్యక్తం చేశారు.వరదలు ఒక్కసారిగా ముంచెత్తడంతో ఇంట్లోని వస్తువులను కూడా సకాలంలో సర్దుకోలేకపోయామని.. ఫ్రిజ్‌లో ఆహార నిల్వలు కూడా లేవని ఆమె చెప్పారు.

సెప్టెంబర్ 16 నుంచి థాయ్‌లాండ్‌లోని 41 ప్రావిన్సులు వరదల బారినపడ్డాయి. ఇప్పటివరకు కనీసం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వరదల ప్రభావం 5.8 లక్షలకు పైగా ఇళ్లపై పడింది. వరద ప్రాంతాల్లో నివసిస్తున్న 80 వేల మందికి పైగా ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నారని అధికారులు తెలిపారు.

బాధితులకు ఆహారం అందించేందుకు మొబైల్ వంటశాలలు, పడవలను రంగంలోకి దించారు. వరదలు తగ్గేంతవరకు రోజుకు మూడు పూటలా ఆహారం అందించడంతోపాటు.. నీరు తగ్గిన తర్వాత మరో ఏడు రోజుల పాటు సహాయం కొనసాగించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా అధికారులు తెలిపారు.

వరదల కారణంగా థాయ్‌లాండ్ ఆర్థిక వ్యవస్థకు భారీ దెబ్బ తగిలే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా కనీసం 11 బిలియన్ భాట్ (సుమారు రూ.2,700 కోట్లు) మేర ఆర్థిక నష్టం వాటిల్లవచ్చని రాంగ్‌సిట్ యూనివర్సిటీ ఆర్థిక విభాగానికి చెందిన ఆత్ పిసాన్‌వానిచ్ తెలిపారు. పరిస్థితులు మెరుగుపడకపోతే నష్టం మరింత పెరగవచ్చని పేర్కొన్నారు.ఈ ఏడాది థాయ్‌లాండ్ జీడీపీ వృద్ధి రేటుపై వరదల ప్రభావం పడే అవకాశం ఉందని.. సుమారు 0.3 శాతం పాయింట్ల మేర వృద్ధి తగ్గి 2.1 శాతానికి చేరవచ్చని ఆయన అంచనా వేశారు.బ్యాంకాక్, తూర్పు ప్రాంతాల్లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలపై ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని.. ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యవసాయ రంగం దెబ్బతినే అవకాశం ఉందని వివరించారు.

**బ్యాంకాక్‌లోనే రూ.1,700 కోట్ల నష్టం**

రాజధాని బ్యాంకాక్ ఒక్కటే వరదల కారణంగా సుమారు 7 బిలియన్ భాట్ (దాదాపు రూ.1,700 కోట్లు) నష్టపోయే అవకాశం ఉందని యూనివర్సిటీ ఆఫ్ ది థాయ్ చాంబర్ ఆఫ్ కామర్స్ తెలిపింది.దేశవ్యాప్తంగా మొత్తం నష్టం సుమారు 12.3 బిలియన్ భాట్‌కు చేరవచ్చని అంచనా వేసింది.

బ్యాంకాక్‌లోని బాంగ్ కాపి ప్రాంతంలో వరద నీటిలోనే ప్రజలు నిత్యావసరాల కోసం మార్కెట్లకు వస్తున్నారు. వ్యాపారులు కూడా వెనక్కి తగ్గకుండా వినూత్నంగా అమ్మకాలు సాగిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ప్లాస్టిక్ బాక్సులు, డ్రమ్ములను తేలియాడే స్టాళ్లుగా మార్చి వాటిపై సరుకులు ఉంచి విక్రయిస్తున్నారు. వ్యాపారి మారిసా సింగ్రుఖోన్ తన దుకాణంలోని సరుకులను బయటకు తీసుకొచ్చి మార్కెట్ అంచున విక్రయిస్తున్నారు. అయితే అక్కడ కూడా మోకాళ్ల లోతు నీటిలోనే నిలబడాల్సి వస్తోంది. 'వినియోగదారులు నీటిలోకి రావడానికి ఇష్టపడటం లేదు. ఎక్కువసేపు నీటిలో నిలబడలేరు. అందుకే మేమే నీటిలో నిలబడి బయట నుంచి వారికి సరుకులు విక్రయిస్తున్నాం" అని ఆమె చెప్పారు.

బ్యాంకాక్‌లో ఇప్పటివరకు 5,901 మంది 234 సహాయ శిబిరాలకు తరలివెళ్లినట్లు నగర పాలనా అధికారులు తెలిపారు. సముద్ర మట్టానికి కేవలం 1.5 మీటర్ల ఎత్తులో నదీ డెల్టాపై విస్తరించిన బ్యాంకాక్.. మెత్తటి మట్టి నేలపై భారీ నిర్మాణాలతో అభివృద్ధి చెందింది. దీంతో నగరం ఏటా కొన్ని మిల్లీమీటర్ల మేర కుంగిపోతోంది. 8.4 మిలియన్లకు పైగా జనాభా ఉన్న



ఈ మహానగరం ప్రతి ఏడాది సుమారు ఆరు నెలల పాటు కొనసాగే వర్షాకాలంలో తరచూ వరదలతో పోరాడుతోంది.

బ్యాంకాక్‌కు తూర్పున ఉన్న తీర ప్రాంత ప్రావిన్స్ రయాంగ్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అక్కడి రెండు రిజర్వాయర్లు సామర్థ్యాన్ని మించిపోయే స్థాయికి నీటిమట్టం చేరడంతో అధికారులు సోమవారం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. గత ఏడాది దక్షిణ థాయ్‌లాండ్‌లో సంభవించిన భారీ వరదల విషాదం ఇంకా మరువకముందే తాజా వరదలు ఆ దేశాన్ని మరోసారి వణికిస్తున్నాయి. అప్పట్లో మూడు రోజుల్లోనే 630 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో కనీసం 145 మంది ప్రాణాలు కోల్పోయారు. 33 వేలకుపైగా ఇళ్లు నీట మునిగాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు వంటి కీలక మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పుడు బ్యాంకాక్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాలను వరదలు చుట్టుముట్టడంతో.. వర్షాలు తగ్గి నీరు ఎప్పుడు దిగుతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# ఆసియా క్రీడల్లో ఈషా సింగ్‌కు వెండి పతకం.. సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



హైదరాబలాద్, సెప్టెంబర్ 28: జపాన్‌లో జరుగుతోన్న 2026 ఆసియా క్రీడల్లో భారత షూటర్ ఈషా సింగ్ రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆసియా క్రీడల్లో మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్ షూటర్, తెలంగాణ ముద్దుబిడ్డ హైదరాబాద్ నగరానికి చెందిన ఈషా సింగ్ వెండి పతకం సాధించడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఐదుసార్లు షూటాఫ్‌లలో ఒత్తిడిని ధైర్యంగా ఎదుర్కొని, స్వల్ప తేడాతో బంగారు పతకాన్ని కోల్పోయినా ఆమె ప్రదర్శన అద్భుతమని ప్రశంసించారు. ఈషా సింగ్ పోరాట స్ఫూర్తి క్రీడాలోకానికి ఆదర్శమని పేర్కొన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై మరెన్నో గొప్ప విజయాలు అందుకొని దేశ ప్రతిష్ఠను, తెలంగాణ కీర్తిని చాటాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

ఆసియా క్రీడాల్లో ఈరోజు(సోమవారం) జరిగిన ఫైనల్ పోరులో టై బ్రేకర్‌లో చైనా షూటర్ జియావో చేతిలో ఈషా సింగ్ ఓడిపోయింది. స్వర్ణం కోసం చివరి వరకు పోరాడిన ఈషా.. టై బ్రేకర్‌లో మాత్రం 2-3 తేడాతో పరాజయం పాలై.. రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో మొత్తం ఆరు షూటాఫ్‌లను ఈషా సింగ్ ఎదుర్కొంది. ఇందులో నాలుగు సిల్వర్, బ్రాంజ్ కోసం జరిగిన పోరు కాగా.. మరో రెండు షూటాఫ్‌లు స్వర్ణం కోసం జరిగాయి. అయితే ఒక్క షాట్ తేడాతో స్వర్ణాన్ని చేజార్చుకున్న ఈషా సింగ్.. వెండి పతకంతో సరిపెట్టుకుంది.

# తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శిగా జీ.రవి..



హైదరాబలాద్, సెప్టెంబర్ 28: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శిగా రవి జీ, ఐఏఎస్ (2015 బ్యాచ్) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లోని అధికారిక కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. సెప్టెంబర్ 26న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగింది.

రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న విద్యా సదుపాయాల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలను టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి నిర్వహించాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని ఈ సంస్థల పరిధిలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. సంస్థ వెబ్‌సైట్‌లోనూ విద్యార్థుల విద్యతో పాటు క్రీడా రంగంలో సాధించిన విజయాలను నమోదు చేసింది.

రవి జీ ప్రస్తుతం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీగా కూడా కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి బాధ్యతలతో పాటు ఈ పదవిలోనూ కొనసాగనున్నారు.

గతంలో వివిధ జిల్లాల పరిపాలనా బాధ్యతల్లో పనిచేసిన రవి జీకి తాజాగా టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ వంటి కీలక సంస్థ బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన సోమవారం అధికారికంగా కొత్త బాధ్యతలను స్వీకరించారు.

# అమెరికాతో అంతిమ యుద్ధానికి మేం సిద్ధంగా ఉన్నాం.. ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ స్ట్రాంగ్ కౌంటర్..!



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 ఇరాన్ శాంతి ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ తిరస్కరించడంతోపాటు బెదిరింపు ధోరణిలో వ్యాఖ్యలు చేయడంతో పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొన్నది. ఈ క్రమంలో ఇరాన్ కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అమెరికాతో తాము అంతిమ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు.

అమెరికాతో యుద్ధాన్ని తిరిగి ప్రారంభించేందుకు తాము పూర్తి సిద్ధంగా ఉన్నామని, ఒకవేళ అది అంతిమ యుద్ధానికి దారితీసినా తాము ఎదుర్కొంటామని అరాగ్చీ అన్నారు. అదే సమయంలో చర్చలకూ తాము సిద్ధమేనని, ఏది జరగాలన్నది ట్రంప్ చేతిలోనే ఉందని అరాగ్చీ చెప్పారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే ప్రతిపాదనలను ట్రంప్ బహిరంగంగా తిరస్కరించడంపై ఆయన స్పందించారు. ఈ అంశంపై దౌత్యమార్గాల ద్వారా తమకు ఎలాంటి కమ్యూనికేషన్ లేదని చెప్పారు.

అక్రమంగా ఫ్రీజ్ చేసిన తమ డబ్బులు, ఆస్తులు తమకు కావాలని అరాగ్చీ డిమాండ్ చేశారు. తమ చమురును తాము అమ్ముకోగలిగే పరిస్థితి ఉండాలన్నారు. ఘర్షణలు తగ్గించేలా చర్చలతో పరిష్కారాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. అలాంటప్పుడు తాము హర్మూజ్‌ను తెరిచేందుకు సుముఖంగానే ఉంటామని అరాగ్చీ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన కింగ్‌ఫిష్ డ్రోన్ గూఢచర్యానికి పాల్పడుతోందని, దానిని తాము స్వాధీనం చేసుకున్నామని ఇరాన్ ప్రకటించింది.

# మరో కీలక ప్రయోగానికి సిద్ధమైన స్పేస్ ఎక్స్..

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 28: పునర్వినియోగ రాకెట్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న స్పేస్ ఎక్స్ సంస్థ కీలక ప్రయోగానికి సిద్ధమైంది. స్టార్‌షిప్ రాకెట్ సాయంతో బ్రాడ్‌బాండ్ శాటిలైట్‌లను కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు నేడు ప్రయత్నించనుంది. స్టార్‌షిప్‌కు సంబంధించి ఇది 14వ ప్రయోగం. ఈసారి ఆర్బిటాల్ పరీక్షలో భాగంగా స్టార్‌షిప్ భూమి చుట్టూ ఆరుసార్లు చెక్కర్లు కొట్టనుంది. భారత్ మీదుగా కూడా ప్రయాణించనుంది. ఈ క్రమంలో తొలిసారిగా స్టార్‌లింక్ వీ3 శాటిలైట్‌లను కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. భూమి చుట్టూ పలుమార్లు పరిభ్రమించే సామర్థ్యాన్ని, శాటిలైట్లను క్షక్ష్యలోకి ప్రవేశపెట్టే సమార్థ్యాలను నిరూపించేందుకు స్పేస్ ఎక్స్ ఈ ప్రయోగం నిర్వహిస్తోంది.

ఈ ప్రయోగం విజయవంతమైతే పునర్వినియోగ రాకెట్ సాయంతో శాటిలైట్లు, ఇతర గ్రహాంతర మిషన్లు చేపట్టేందుకు మార్గం మరింత సుగమం అవుతుంది. ఇలాంటి మిషన్లకు పునర్వియోగ రాకెట్స్ అత్యంత అనువైనవన్న భావనతో ఎలాన్ మస్క్ సారథ్యంలోని స్పేస్ ఎక్స్ స్టార్‌షిప్ రాకెట్స్‌ను అభివృద్ధి చేస్తోంది. భారత కాలమానం ప్రకారం, నేటి సాయంత్రం 5 -7 గంటల మధ్య ఈ ప్రయోగం నిర్వహించనున్నారు. ఈ విశేషాలు ప్రపంచవ్యాప్తంగా లైవ్ స్ట్రీమ్ చేయనున్నారు.

స్పేస్ ఎక్స్ తెలిపిన వివరాల ప్రకారం, దాదాపు 10 గంటల పాటు ఈ ప్రయోగం నిర్వహించనున్నారు. 26 స్టార్‌లింక్ వీ3 శాటిలైట్లను కక్ష్యలోకి ప్రవేశపెడతారు. ఈ పరీక్షలో రాకెట్ కక్ష్యలోకి చేరుకోవడం, శాటిలైట్‌లను కక్ష్యలోకి ప్రవేశపెట్టే విధానం, ఆ తరువాత నియంత్రిత విధానంలో భూమీ మీదకు మళ్లీ చేరుకోవడం తదితర దశలన్నీ క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. దాదాపు 275 కిలోమీటర్ల ఎత్తున ఉన్న కక్ష్యలో స్టార్‌షిప్ ఈసారి ఆరు సార్లు భూమి చుట్టు పరిభ్రమిస్తుంది. ప్రయోగం చివర్లో పసిఫిక్ సముద్రంలో స్ప్లాష్ డౌన్ (దిగుతుంది) అవుతుంది.

చరిత్రాత్మక ఫ్లైట్5 ప్రయోగంలో స్టార్‌షిప్ హెవీ బూస్టర్‌ను ( రాకెట్ ప్రాథమిక దశ) మళ్లీ ప్రయోగ టవర్ వద్ద క్యాచ్ చేసిన విషయం తెలిసిందే. ఈసారి మాత్రం శాటిలైట్లు కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతో పాటు రాకెట్ గమనానికి సంబంధించి ఇతర కీలక అంశాలపై దృష్టిపెట్టనుంది. శాటిలైట్లను కక్ష్యలోకి ప్రవేశపెట్టే స్టార్‌షిప్ స్పేస్‌క్రాఫ్ట్‌తో పాటు హెవీ బూస్టర్ కూడా సముద్రంలో స్ప్లాష్ డౌన్ కానున్నాయి.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మ తిరిగే రిజల్ట్స్ వస్తాయి: దానం నాగేందర్



హైదరాబలాద్, సెప్టెంబర్ 28: ఖైరతాబాద్ ఉప ఎన్నికపై దానం నాగేందర్ (ఆజీనిజీఏ ఔజీణవనిటవతీ) కీలక వ్యాఖ్యలు చేశారు. సర్ ప్రభావం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉండదని స్పష్టం చేశారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు. ఉప ఎన్నికలో దిమ్మ తిరిగే రిజల్ట్స్ వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఎవడు కొడితే మైండ్ బ్లాక్ అవుతుందో.. అలా రిజల్ట్స్ ఉంటాయని కుండ బద్దలు కొట్టారు.

బీజేపీ సీఈసీని అడ్డంపెట్టుకొని ఓటు చోరీకి పాల్పడుతోందని దానం నాగేందర్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఓటు చోరీతోనే గెలిచారని ఆరోపణలు చేశారు. ఓటు చోరీకి పాల్పడకపోతే కిషన్‌రెడ్డి అసలు గెలిచేవారే కాదని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోనైనా జ్ఞనేశ్ కుమార్‌ను తొలగించాలని దానం నాగేందర్ కోరారు.

# ఏపీ వాసులకు గుడ్ న్యూస్..బంగాళాఖాతంలో మరో వాయుగుండం

అమరావతి, సెప్టెంబర్ 28: ఏపీ వాసులకు వాతావరణశాఖ మరో గుడ్‌న్యూస్ తెలిపింది . బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడిందని వెల్లడించింది. ఇది మయన్మార్-అండమాన్ మధ్య ఏర్పడిందని, రాగల 12 గంటల్లో తీవ్రగుండంగా మారే అవకాశముందని స్పష్టం చేసింది. వాయుగుండం ప్రభావంతో రాబోయే 72 గంటల్లో రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ అధికారులు వివరించారు.గంటకు 30-40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వివరించారు. గత వారం వాయుగుండం కారణంగా ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, విశాఖ , తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలో భారీ వర్షపాతం నమోదయ్యాయి. నంద్యాల, చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాలో 9 సెంటిమీటర్ల లోపు వర్షం కురిసింది .

# మంచిర్యాలలో ఆటోను ఢీకొన్న లారీ.. ఇద్దరి మృతి

మంచిర్యాల, సెప్టెంబర్ 28: జిల్లాలోని నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు.స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. జిల్లాలోని నస్పూర్ నుంచి మంచిర్యాల కేంద్రం వైపు వెళుతున్న ఓ లారీ నస్పూర్ గేటు వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు.. క్షతగాత్రులను సమీప ఆసుపత్రిలో చేర్పించారు. ముగ్గురు ప్రయాణికులు ప్రాణాపాయస్థితిలో ఉన్నారని వైద్యులు వెల్లడించారు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రాథమిక దర్యాప్తులో మృతి చెందిన వారిని మందమర్రి మండలం గుడిపెల్లి గ్రామానికి చెందిన అత్తలి సౌందర్య, చింతకుంట లక్ష్మిగా గుర్తించారు.

# సరైన సమాచార లభ్యతతో సమ్మిళిత అభివృద్ధి

## (సెప్టెంబర్ 28న "అంతర్జాతీయ సమాచార సార్వత్రిక లభ్యత దినోత్సవం" సందర్భంగా)

రోజువారీ జీవితంలో సరైన, సకాలంలో నిర్ణయాలు, తగు చర్యలు తీసుకోవడానికి ప్రతి ఒక్కరికీ కనీస సమాచారం ఎల్లప్పుడూ అవసరం అవుతుంది. తగినంత సమాచారం లేకుండా, ప్రజలు సరైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుస్థిర అభివృద్ధికి సమాచార లభ్యత కూడా అత్యంత కీలకం. ఇది ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 16 క్రింద ఒక సూచిక, దీని లక్ష్యం "శాంతియుత, సమ్మిళిత సమాజాలను ప్రోత్సహించడం, న్యాయం అందించడం, అన్ని స్థాయిలలో జవాబుదారీతనాన్ని నిర్మించడం" అని మనకు తెలుసు. "సార్వత్రిక సమాచార లభ్యత లేదా ప్రాప్యత" అంటే ప్రతి ఒక్కరికీ సమాచారాన్ని కోరే, స్వీకరించే, అందించే హక్కు ఉందని అర్థం. ఈ హక్కు భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కులో ఒక అంతర్భాగం. ప్రజలకు సంబంధించిన సమస్యల గురించి తెలియజేయడానికి మీడియా ఒక ముఖ్యమైన మాధ్యమం. సార్వత్రిక సమాచార లభ్యత హక్కు అంటే పత్రికా స్వేచ్ఛ, సమాచార హక్కు తప్ప మరేమీ కాదు. సమాచారం తెలిసిన పౌరులు మాత్రమే సరైన నిర్ణయాలు తీసుకోగలరు. సమాచార లభ్యత అనేది ఒక దేశం యొక్క ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడం. సార్వత్రిక సమాచార లభ్యత అనేది ఆరోగ్యకరమైన, సమ్మిళిత విజ్ఞాన సమాజానికి మూలస్తంభం.

### అంతర్జాతీయ సార్వత్రిక సమాచార లభ్యత దినోత్సవం:

సరైన నిర్ణయాలు తీసుకోవడానికి సామాన్య ప్రజలకు సమాచార ప్రాప్యత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పడానికి, 2015లో యునెస్కో సెప్టెంబర్ 28ని "అంతర్జాతీయ సార్వత్రిక సమాచార లభ్యత దినోత్సవం"ను వార్షిక కార్యక్రమంగా ప్రకటించింది. విశ్వసనీయమైన అధికారిక సమాచార లభ్యత లేదా ప్రాప్యత, చురుకైన సమాచార వెల్లడి, మీడియా, సమాచార అక్షరాస్యత, నమ్మదగిన డేటా, డిజిటల్ సాంకేతికతలు ఆరోగ్యకరమైన సమాచార వాతావరణానికి ఎలా దోహదపడతాయో అనే అంశంపై ఈ రోజు చర్చ జరుగుతుంది. ప్రస్తుతం, డిజిటల్ ప్రపంచం సమాచారం, తప్పుడు సమాచారం, దుష్ప్రచారంతో నిండిపోయి ఉంది, అందువల్ల కేవలం సమాచార లభ్యత మాత్రమే సరిపోదు. విశ్వాసాన్ని బలపరిచే సరైన సమాచారంతో కూడిన నిర్ణయాలకు మద్దతు ఇవ్వగల, ప్రజలు అర్థవంతంగా పాల్గొనడానికి సహాయపడే సకాల, విశ్వసనీయమైన సమాచారం సామాన్యులకు అవసరం.

### అంతర్జాతీయ సార్వత్రిక సమాచార లభ్యత దినోత్సవం-2026 ఇతివృత్తం:

అంతర్జాతీయ సార్వత్రిక సమాచార లభ్యత దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తం "డిజిటల్ యుగంలో సమాచార సమగ్రతను నిలబెట్టడం. సమాచార గందరగోళాన్ని పరిష్కరించడంలో సమాచార లభ్యత పాత్ర" అనబడే అంశం తీసుకోబడింది. ఇతర మానవ హక్కులను పరిరక్షించడానికి, విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, ప్రజాస్వామ్య సమాజాలను ముందుకు తీసుకెళ్లడానికి సమాచార ప్రాప్యత హక్కు యొక్క ప్రాముఖ్యతను గుర్తించడం దీని ఉద్దేశ్యంగా ఉంది. అలాగే, ప్రజలకు సమాచార ప్రాప్యతను కల్పించడం, ప్రాథమిక స్వేచ్ఛలను పరిరక్షించడం ద్వారా సుస్థిర అభివృద్ధి కోసం శాంతియుత సమ్మిళిత సమాజాలను ప్రోత్సహించడం కూడా దీని లక్ష్యం.

వ్యక్తులను వారి నిర్ణయ ప్రక్రియల్లో శక్తివంతం చేయడానికి, వారి మానవ హక్కులను పూర్తిగా వినియోగించుకోవడానికి వీలు కల్పించడానికి కూడా ఇది చాలా కీలకం. ఈ రోజును ఏటా జరుపుకోవాలని నిర్ణయించుకోవడం ద్వారా, సామాజిక సమ్మిళితం, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం, చైతన్యవంతమైన ప్రజా జీవితాన్ని ప్రోత్సహించడంలో సమాచార లభ్యత పోషించే పాత్రను ఐక్యరాజ్యసమితి నొక్కి చెబుతోంది. ఇది ప్రపంచ పౌర సమాజానికి ఒక కార్యాచరణ పిలుపుగా భావించాలి



-మధుపాళీ
9949700037

# పీఎం మెమెంటోస్ ఇ-వేలం 2026లో మహారాష్ట్ర వారసత్వం, కళలు, సమకాలీన విజయాల ప్రదర్శన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26మహారాష్ట్ర సుసంపన్న చారిత్రక వారసత్వం, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, స్వదేశీ కళారూపాలు, సమకాలీన విజయాలు పీఎం మెమెంటోస్ ఇ?వేలం 2026లో ఆవిష్కృతమయ్యాయి. ఈ సేకరణలో మహారాష్ట్ర వైవిధ్యభరిత సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే శిల్పాలు, చిత్రాలు, కళాకృతులు, స్మారక జ్ఞాపికలు, మతపరమైన కళాఖండాలు, క్రీడా జ్ఞాపికలు, నమూనాలు వంటి విస్తృత శ్రేణి వస్తువులు ఉన్నాయి.

ఈ సేకరణలో ప్రధానంగా కనిపించే అంశాల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ చిరస్థాయిగా నిలిచిన వారసత్వం ఒకటి. మరాఠా పాలకుడిని విభిన్న రూపాలు, కళాశైలుల్లో చిత్రీకరించిన పలు స్మారక వస్తువులు ఇందులో ఉన్నాయి. గుర్రంపై ఆయన స్వారీ చేస్తున్నట్లు, సింహాసనంపై కూర్చున్నట్లు, సింహంతో కలిసి ఉన్నట్లు, రాజసంబంధ వేడుకల్లో పాల్గొంటున్నట్లు శివాజీ మహారాజ్‌ను చిత్రీకరించిన విగ్రహాలు ఇందులో ఉన్నాయి.

రజత విగ్రహం, చెక్కతో చెక్కిన చిత్రపటం, ఫ్రేమ్ కట్టిన కళాకృతి, రాయ్‌గఢ్ కోటలోని మేఘదాంబరీ నమూనా కూడా ఈ సేకరణలో ఉన్నాయి.

మహారాష్ట్రలోని భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పలు కళాకృతులు కూడా ఇందులో ఉన్నాయి. సంప్రదాయ సంగీత వాయిద్యాలతో సంత్ తుకారామ్‌ను చిత్రీకరించిన కళాకృతులు, ధ్యానంలో ఉన్న సంత్ జ్ఞానేశ్వర్‌ను ప్రతిబింబించే చిత్రాలు వీటిలో ఉన్నాయి.

ఈ సేకరణలో మహారాష్ట్రకు చెందిన స్వదేశీ కళా సంప్రదాయాలకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా పలు వార్లీ కళాశైలి చిత్రాలు రాష్ట్ర సాంప్రదాయ కళా వైభవాన్ని చాటుతున్నాయి. గిరిజన నాయకుడు బిర్సా ముండా చిత్రపటాన్ని వార్లీ కళా రూపాలతో కలిపి రూపొందించిన ఒక చిత్రంతో పాటు, గ్రామీణ జీవనం, వ్యవసాయం, పండుగలు, సామాజిక సంప్రదాయాలను వార్లీ కళకు విశిష్టమైన జ్యామితీయ ఆకృతులతో చిత్రీకరించిన ఇతర కళాకృతులు కూడా ఉన్నాయి. ముదురు మెరూన్ రంగు వస్త్రంపై చేతితో చిత్రించిన వార్లీ కళాకృతితో పాటు, వస్త్రంపై రూపొందించిన మరికొన్ని చిత్రాలు ఈ సంప్రదాయ కళారూపంలోని వైవిధ్యాన్ని చాటుతున్నాయి.

ఈ జాబితాలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కళాకృతులతో పాటు మహారాష్ట్ర క్రీడా విజయాలకు సంబంధించిన జ్ఞాపికలకు కూడా చోటు కల్పించారు. పారా-బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సుకాంత్ కదమ్ సంతకం చేసిన బ్యాడ్మింటన్ రాకెట్, అలాగే 2024 పారిస్ పారాలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన సచిన్ ఖిలారీకి చెందిన సంతకం చేసిన క్యారీ బ్యాగ్, షాట్‌పుట్ ఇందులోని ప్రముఖ క్రీడా జ్ఞాపికల్లో ఉన్నాయి.

మహారాష్ట్రలో చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంస్థాగత ప్రగతికి సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలు కూడా పలు జ్ఞాపికల్లో ప్రతిబింబించాయి. వధావన్ ఓడరేవు, థానే?బోరివలి జంట సొరంగ ప్రాజెక్టు, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన నమూనాలు ఇందులో ఉన్నాయి. దేశ సామాజిక, మేధో వారసత్వాన్ని ప్రతిబింబించే జ్ఞాపికలకు కూడా ఈ జాబితాలో ముఖ్య స్థానం కల్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, లోకమాన్య బాల గంగాధర్ తిలక్, అహల్యాబాయి హోల్కర్, పేష్వా బాజీరావు?ఎ చిత్రపటాలు, శిల్పాలు ఇందులో ఉన్నాయి.

మొత్తంగా 89 జ్ఞాపికలు మహారాష్ట్ర సాంస్కృతిక గుర్తింపులోని విభిన్న కోణాలను ఒకే చోట ఆవిష్కరిస్తాయి. చారిత్రక ప్రముఖులు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, జానపద కళలు, మతపరమైన నిర్మాణాలు, క్రీడా విజయాలు, ఆధునిక మౌలిక వసతులు ఇందులో చోటు చేసుకున్నాయి. చేతితో రూపొందించిన వార్లీ చిత్రాలు, ఆధ్యాత్మిక శిల్పాల నుంచి సంస్థాగత ప్రాజెక్టుల నమూనాలు, క్రీడా జ్ఞాపికల వరకు ఈ సేకరణ మహారాష్ట్ర వారసత్వం, విజయాల వైవిధ్యాన్ని చాటుతోంది.

# మహమ్మారిని ఎదుర్కోవటం అందరి బాధ్యత... సమానత్వం, ప్రపంచ ఐక్యత అత్యంత కీలకమన్న శ్రీమతి శ్రీ వాత్సవ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28న్యూయార్క్‌లో సెప్టెంబర్ 25న 'మహమ్మారి నివారణ, సంసిద్ధత, ప్రతిస్పందన'పై ఐక్యరాజ్యసమితి ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భారత్ తరఫున కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాత్సవ ప్రాతినిధ్యం వహించారు. అంతర్జాతీయ సహకారం ద్వారా ప్రపంచ ఆరోగ్య భద్రతను బలోపేతం చేసేందుకు భారత్ నిబద్ధతతో ఉన్నట్లు స్పష్టం చేశారు. కొవిడ్-19 మహమ్మారి నేర్పిన పాఠాలను నిరంతర పెట్టుబడులు, సంస్థాగత సామర్థ్యం, పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థలుగా మలచాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి శ్రీమతి శ్రీవాత్సవ ప్రసంగిస్తూ... మహమ్మారి నివారణ, ప్రతిస్పందన కోసం ప్రభుత్వం, సమాజ భాగస్వామ్యంతో కూడిన భారతదేశ సమన్వయ విధానాన్ని వివరించారు. ఇది ఆరోగ్య అత్యవసర పరిస్థితులను విస్తృతంగా కవర్ చేస్తుంది. ఆరోగ్య అత్యవసర పరిస్థితులకు సమర్థవంతంగా స్పందించేలా వ్యవస్థలు సిద్ధంగా ఉండేలా చూడటానికి ప్రయోగశాలల వ్యవస్థలు, అత్యవసర సమన్వయం, ఆరోగ్య కార్యకర్తలు, నిల్వలు, క్లినికల్ కేర్ సామర్థ్యాన్ని విస్తరించేందుకు దేశం చేస్తున్న ప్రయత్నాల గురించి ఆమె మాట్లాడారు.

ఈ ప్రయత్నాలు దేశీయ ఆరోగ్య వ్యవస్థలు, అభివృద్ధి ప్రణాళికలు, స్వదేశీ నిధులపై ఆధారపడి ఉండాలని, దేశీయ బాధ్యతకు అంతర్జాతీయ సహాయం తోడ్పాటుగా ఉండాలని ఆమె పేర్కొన్నారు.

కొవిడ్-19 సమయంలో భారత్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను ప్రపంచ ఉమ్మడి సంపదగా గుర్తించాలని శ్రీమతి శ్రీవాత్సవ కోరారు. మహమ్మారి సమయంలో నిఘా, టీకాలు వేయటం, ప్రమాదాల గురించి ముందస్తుగా హెచ్చరించటం, సరఫరా వ్యవస్థలు, ఆరోగ్య సేవల నిరంతర నిర్వహణలో డిజిటల్ పరిష్కారాలు కీలక పాత్ర పోషించాయని ఆమె తెలిపారు.

సమైక్యత ప్రాముఖ్యతను, అత్యవసర ఆరోగ్య ఉత్పత్తులను అందరూ సమానంగా పొందేలా చూడాల్సిన అవసరాన్ని ఆమె స్పష్టం చేశారు. కొవిడ్-19 మహమ్మారి సమయంలో దాదాపు 100 దేశాలకు, రెండు యూఎన్ సంస్థలకు 300 మిలియన్ల వాక్సిన్ డోసులను భారత్ సరఫరా చేసిందని, 150కి పైగా దేశాలకు వైద్య సహాయాన్ని అందించినట్లు చెప్పారు. ఇది "ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం" సూత్రం పట్ల, గ్లోబల్ సౌత్ దేశాల పట్ల భారత్ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు.

మే-2025లో ఆమోదించిన డబ్ల్యూహెచ్ఓ మహమ్మారి ఒప్పందాన్ని కీలక ఘట్టంగా కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అభివర్ణించారు. సమర్థవంతమైన పాథోజెన్ యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ (పీఏబీఎస్) వ్యవస్థపై దీని విశ్వసనీయత ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. జాతీయ సార్వభౌమత్వాన్ని గౌరవిస్తూ, వ్యాధికారక క్రిములు, జీవ వనరులను అందించే దేశాలకు సకాలంలో టీకాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు, సాంకేతికతలు, ఇతర ప్రయోజనాలు అందాలని అన్నారు.

పీఏబీఎస్ అనుబంధ అంశాలపై జరుగుతున్న ప్రస్తుత చర్చలను ఈ రాజకీయ ప్రకటన ముందుగానే ప్రభావితం చేయకూడదని... దేశ పరిస్థితులు, సామర్థ్యాలకు అనుగుణంగా దీన్ని అమలు చేయాలని శ్రీమతి శ్రీవాత్సవ తెలిపారు. 'వన్ హెల్త్' విధానానికి వస్తే దేశీయ చట్టాలు, అంతర్జాతీయ చట్టాలు, దేశ పరిస్థితులకు అనుగుణంగా తగిన విధంగా దీన్ని అమలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

మహమ్మారి నివారణ, సంసిద్ధత, ప్రతిస్పందన సాధనాలు, అంచనాలు, డేటాను సమీక్షించి బలోపేతం చేయటంలో సభ్య దేశాల పాత్ర ఎంత ముఖ్యమో ఆమె స్పష్టం చేశారు. ఈ ప్రక్రియల వల్ల విధానపరమైన ప్రభావాలు ఉంటాయని, సభ్య దేశాలతో సంప్రదించి మాత్రమే వాటిని చేపట్టాలని ఆమె పేర్కొన్నారు.

సంసిద్ధతతో ఉండటం అందరి బాధ్యతని.. భవిష్యత్తులో వచ్చే మహమ్మారులు, వ్యాప్తిని ఎదుర్కొనే ప్రయత్నాల్లో సమానత్వం కేంద్రంగా ఉండాలని శ్రీమతి శ్రీవాత్సవ అన్నారు. "ప్రపంచ ఐక్యత కేవలం మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలి" అని చెబుతూ ఆమె ప్రసంగాన్ని ముగించారు.

కొవిడ్-19 తర్వాత ప్రపంచ ఆరోగ్య భద్రతా విధానంలో సాధించిన పురోగతిని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోన్ అధనావ్ గెబ్రెయేసస్ ప్రస్తావించారు. ఇందులో డబ్ల్యూహెచ్ఓ మహమ్మారి ఒప్పందం, అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనలకు చేసిన సవరణలున్నాయి. పీఏబీఎస్ వ్యవస్థపై చర్చలను త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఆలస్యం జరిగితే భవిష్యత్తులో మహమ్మారులను ఎదుర్కొనే ప్రపంచ సామర్థ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు.

కొవిడ్-19 మహమ్మారి తర్వాత ఏమరుపాటుగా ఉండకూడదని, ఈ సమస్యపై రాజకీయంగా నిరంతరం దృష్టి పెట్టాలని ఐక్యరాజ్యసమితి డిప్యూటీ సెక్రటరీ జనరల్ అమీనా మహమ్మద్ హెచ్చరించారు. ముప్పును ముందుగానే గుర్తించి, తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా కమ్యూనిటీ ఆధారిత ముందస్తు గుర్తింపు... నిఘా, సమాచార వ్యవస్థల ప్రాముఖ్యతను ఆమె స్పష్టం చేశారు.

సభ్య దేశాలు, భాగస్వాములు కలిసి భవిష్యత్తులో ఎదురయ్యే ఆరోగ్య అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు, పటిష్టమైన, సమానమైన, సుస్థిరమైన వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా పురోగతిని సమీక్షించటానికి, సవాళ్లను గుర్తించటానికి, ప్రయత్నాలను ముమ్మరం చేసేందుకు ఈ ఉన్నత స్థాయి సమావేశం వేదికగా నిలిచింది.

# సాంబశివాలయం స్థలాన్ని కాపాడండి

## కలెక్టర్, కమిషనర్‌ను కోరిన ఆలయ కమిటీ



ఆదిలాబాద్, సెప్టెంబర్ 28:లక్షెట్టిపేటలో వందేళ్ల చరిత్ర కలిగిన సాంబశివాలయం ముందున్న 7 గుంటల స్థలాన్ని కాపాడాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్త జయప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ స్థలాన్ని 2009లో మోటూరి శ్రీనివాస్ శివకల్యాణం, అన్నదానం, పూజా కార్యక్రమాల కోసం ఆలయానికి దానంగా ఇచ్చారు.

అప్పటి నుంచి ఈ స్థలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. 1992 రికార్డుల్లో శ్రీనివాస్ పేరు ఉండగా, తర్వాతి కాలంలో వేరే వ్యక్తులు పత్రాలు సృష్టించి 2023లో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2026 జనవరిలో మరొకరికి విక్రయించారని కమిటీ ఆరోపించింది.

ఎలాంటి ఇల్లు లేకపోయినా ఇంటి నంబర్ కేటాయించి రిజిస్ట్రేషన్ చేయడంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఆలయం ఎదుట జరుగుతున్న నిర్మాణ ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, కలెక్టర్ , మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకుని భక్తుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వ్యవస్థాపక సభ్యులు కొత్తపల్లి నిరంజన్, కమిటీ సభ్యులు మాదంశెట్టి చందన్, పోడేటి శ్రీనివాస్ గౌడ్, మెట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# నస్పూర్ లో ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మహిళలు మృతి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 28:మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో స్పాట్ లోనే ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మృతుల వివరాలు, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులు, బాధితులు జిల్లా కేంద్రానికి సమీప గ్రామాలైన గుడిపెల్లి, పొన్నారం వాసులు. మంచిర్యాలలోని వివిధ షాపింగ్ మాల్స్ లో ఉద్యోగం చేస్తూ ఉంటారని సోమవారం ఉదయం షాపింగ్ మాల్స్ కి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ఆటోలోనే ఇద్దరు మహిళలు స్పాట్లో చనిపోగా మరో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉందని, ఆటోలో మొత్తం ఏడుగురు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అల్లం వారి కుంటను కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

## కుంటను సాధించుకునే వరకు పోరాటం: రైతులు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 28: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రేండ్లగూడ గ్రామంలోని అల్లం వారి కుంటను భూ ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరుతూ రైతులు, నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో సామాజిక పోరాట సమితి నేత, రైతు సముద్రాల శంకర్, సీపీఐ మండల కన్వీనర్ దాసరి తిరుపతి, రైతులు అల్లం సురేష్, పెద్దన్న, గిరివర్మ, ఆకుల మధుకర్ ఫిర్యాదును అందజేశారు.

అల్లం వారి కుంటను భూస్వాములు, భూ ఆక్రమణదారుల నుంచి కాపాడాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదుపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, అక్కడే ఉన్న అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములును కుంట వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కుంటను సాధించుకోవడమే తమ లక్ష్యమని, ఇందుకోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# గుంటూరు, నంబూరు మధ్య రూ. 108 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 4 లేన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :అంతకు ముందు విశిష్ట అతిథులకు దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సందీప్ మాథుర్ స్వాగతం పలికారు. ఈ జోన్ పరిధిలో భారతీయ రైల్వేలు చేపడుతున్న అభివృద్ధి, భద్రతా పనుల గురించి వివరించారు. గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీమతి సుధేష్ణ సేన్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు శ్రీ భాష్యం రామకృష్ణ, పొన్నూరు శాసనసభ్యులు శ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఈస్ట్ గుంటూరు ఎంఎల్ఏ శ్రీ మహమ్మద్ నజీర్, వెస్ట్ గుంటూరు ఎంఎల్ఏ శ్రీమతి గల్లా మాధవి, ప్రత్తిపాడు ఎంఎల్ఏ, మాజీ ఐఏఎస్ అధికారి శ్రీ బీఆర్ రామాంజనేయులు పాల్గొన్నారు. రైల్వే ఉన్నతాధికారులు, గుంటూరు పౌరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు

✓ ప్రదేశం: గుంటూరు-నంబూరు (గుంటూరు-కృష్ణా కెనాల్ సెక్షన్), ఇన్నర్ రింగ్ రోడ్డును, గోరంట్ల గ్రామాన్ని, బస్ స్టాండ్ రోడ్డును అనుసంధానిస్తుంది.

# అస్సాం భారతదేశానికి చమురు, తేయాకును అందించింది.. ఇప్పుడు అది హరిత ఇంధనంతో ప్రపంచాన్ని నడిపిస్తుంది: డాక్టర్ హిమంత బిశ్వ శర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28భారత్ హరిత ఇంధన ఎగుమతి దారుగా మారే దిశగా ఒక చారిత్రాత్మక అడుగుపడింది. ఈ రోజు గుజరాత్‌లోని గాంధీధామ్, కాండ్లాలో ఉన్న దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ (డీపీఏ) వద్ద దేశంలోని మొట్టమొదటి ఓడరేవు ఆధారిత ఈ-మిథనాల్ కేంద్రానికి ఓడరేవులు- నౌకాయానం- జలమార్గాల (ఎంఓపీఎస్‌డబ్ల్యూ) కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మలు శంకుస్థాపన చేశారు.

రోజుకు 150 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ కేంద్రం.. పునరుత్పాదక విద్యుత్, నీరు- బయోజెనిక్ కార్బన్ డయాక్సైడ్‌లను ఉపయోగించి ఈ-మిథనాల్‌ను ఉత్పత్తి చేస్తుంది. నౌకాయానం మరింత పర్యావరణ అనుకూలమైందిగా మారేందుకు దోహదపడే హరిత ఇంధనం ఇది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే వాణిజ్య మార్గాలలో ఒకటైన ఆసియా-ఐరోపా అంతర్జాతీయ వాణిజ్య కారిడార్‌లో తిరిగే నౌకలకు ఈ ఇంధనాన్ని సరఫరా చేస్తారు. ఈ ప్రాజెక్ట్ భారత్‌ను ప్రపంచ నౌకాయానానికి హరిత ఇంధన ఎగుమతిదారుగా నిలబెడుతుంది. ప్రపంచ దేశాల్లో ఉన్న ఉత్పత్తిదారులతో పోలిస్తే చాలా పోటీ ధరకే ఇక్కడ ఇంధనం ఉత్పత్తి అవుతుంది. అంతర్జాతీయ మార్కెట్లో టన్ను హరిత మిథనాల్ ధర 1,300 డాలర్లు కాగా ఇక్కడ టన్ను ధర 750 డాలర్లు మాత్రమే. దీనివల్ల ఈ కేంద్రం భారత్‌ను హరిత ఇంధన ఉత్పత్తి, సరఫరాలో ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దనుంది.

ఈ రూ. 2,300 కోట్ల ప్రాజెక్ట్‌ను దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ (డీపీఏ), నామరూప్‌కు చెందిన అసోం పెట్రో-కెమికల్స్ లిమిటెడ్‌లు (ఏపీసీఎల్) సంయుక్తంగా చేపడుతున్నాయి. దీనిని స్కేలబుల్ మాడ్యూల్స్‌గా దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. రోజుకు 50 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్ట్ మొదటి దశకు రూ. 1,200 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. దీనిని 2027 జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ తర్వాత రెండో దశలో ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 100 టన్నుల మేర పెంచుతారు. దీని కోసం రూ. 1,100 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. దీనిని 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నారు. తద్వారా మొత్తం పెట్టుబడి రూ. 2,300 కోట్లకు చేరుతుంది.

2070 నాటికి 'సున్నా స్థాయికి నికర కర్బన ఉద్గారాలు (నెట్ జీరో)' సాధించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు ఈ ప్రాజెక్ట్ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. ప్రధానమంత్రి తీసుకున్న 'ఇంధన రంగంలో ఆత్మనిర్భరత, భారత్‌లో తయారీ, ప్రపంచ కోసం తయారీ' అనే మిషన్‌ల అమలుకు ఇది దోహదపడుతుంది. భారతదేశ సముద్ర రంగాన్ని విస్తరించే దిశగా జరుగుతున్న విస్తృత ప్రయత్నాలలో భాగంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. రాబోయే ఐదేళ్లలో దేశ వాణిజ్య నౌకాదళంలో 100 కొత్త నౌకలను చేర్చాలని, 2047 నాటికి ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ నౌకలు కలిగిన మొదటి 5 దేశాల్లో భారత్‌ను ఒకటిగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రణాళిక వేసింది. ప్రపంచ నౌకాయాన దిగ్గజం 'మెర్స్క్' కూడా భారత్‌లో తయారైన కంటైనర్లను ఆర్డర్ చేయడం ప్రారంభించింది. దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీకి ఉన్న విస్తృత మెగా ఓడరేవుల ప్రణాళికలో భాగంగా వదినార్‌లో రూ. 1,520 కోట్ల వ్యయంతో చేపట్టిన డీపీఐ-కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) నౌకా నిర్మాణ ప్రాజెక్ట్ కూడా ప్రస్తుతం కొనసాగుతోంది. దీనితో పాటు పోర్‌బందర్‌లోని కుచ్ఛాడి వద్ద ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ నౌకానిర్మాణ కేంద్రం, రిపేర్ క్లస్టర్‌కు కూడా సూత్రప్రాయంగా ఆమోదం లభించింది.

లోక్‌సభలో డిబ్రూగర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ.. అసోం పెట్రో-కెమికల్స్ తన నియోజకవర్గమైన నామరూప్‌లో ఉందని పేర్కొన్నారు. ద్వారకా శ్రీకృష్ణుడు, ఈశాన్య ప్రాంత రుక్మిణి పురాణగాథ, తేజ్‌పూర్ ఉషా-అనిరుద్ధుల కథ, 15వ శతాబ్దపు అసోమీయ సాధువు శ్రీమంత శంకరదేవ రచనలను ప్రస్తావించిన ఆయన.. అస్సాం, గుజరాత్ మధ్య ఉన్న సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. అస్సాం, గుజరాత్‌ల బలాలను దేశ సేవలో మమేకం చేస్తూ 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'కు ఈ ప్రాజెక్ట్ అద్దం పడుతోందని ఆయన అభివర్ణించారు.

"ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ గతంలో కంటే వేగంగా హరిత మార్గంలో అభివృద్ధి చెందుతోంది. ఆ ప్రయాణానికి నాయకత్వం వహిస్తున్నందుకు గుజరాత్ గర్విస్తోంది" అని భూపేంద్ర పటేల్ అన్నారు. "కచ్, గుజరాత్‌కు ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం ఇప్పుడు కాండ్లా ద్వారా ప్రపంచ నౌకలకు శక్తినిస్తుంది. ఈ కేంద్రం మన పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని ఎగుమతిగా మారుస్తుంది.. గుజరాత్ తీరాన్ని ప్రపంచం కోసం భారత హరిత ఇంధన ద్వారంగా తీర్చిదిద్దుతుంది." అని ఆయన వ్యాఖ్యానించారు.

"ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశానికి ఇతరులను అనుసరించడం కాకుండా నాయకత్వం వహించే ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించారు" అని సర్బానంద సోనోవాల్ అన్నారు. "భారత్ ఇప్పుడు స్వయంగా నౌకలు, కంటైనర్లను ఎలా తయారు చేస్తోందో అలాగే త్వరలోనే ప్రపంచ వాణిజ్యాన్ని నడిపించే స్వచ్ఛమైన ఇంధనాన్ని కూడా తయారు చేస్తుంది. రాబోయే సంవత్సరాల్లో సింగపూర్-రోటర్‌డ్యామ్ మార్గంలో కాండ్లా ఒక హరిత ఇంధన కేంద్రంగా మారుతుంది. దేశంలోని ప్రతి ప్రధాన ఓడరేవుకు ఈ కేంద్రం ఒక ఆదర్శప్రాయమైన నమూనా. ఇది మన యువతకు నైపుణ్యంతో కూడిన ఉపాధి అవకాశాల ద్వారాలను తెరుస్తుంది. 2070 నాటికి సున్నా స్థాయి నికర కర్బన ఉద్గారాలు సాధించడంలో, 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాలను చేరుకోవడంలో భారత్‌కు ఇది గట్టి తోడ్పాటునందిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

"ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈశాన్య ప్రాంతాన్ని భారత్ అభివృద్ధి కథకు ముఖ్యమైనదిగా ఉంచారు. ఆ నమ్మకానికి అస్సాం తన పారిశ్రామిక స్ఫూర్తితో, ఆశయాలతో ప్రతిఫలమిస్తోంది" అని డాక్టర్ హిమంత బిశ్వ శర్మ అన్నారు. "మహాబ్రహ్మపుత్ర నది, సమృద్ధిగా లభించే సూర్యరశ్మి, అపారమైన జలవిద్యుత్ సామర్థ్యంతో కూడిన అస్సాం.. హరిత ఇంధన శక్తికేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉంది. ఈరోజు ఒక అస్సాం కంపెనీ ఆ శక్తిని నామరూప్ నుంచి కాండ్లా వరకు తీసుకువెళ్లింది. దేశ స్వచ్ఛమైన ఇంధన భవిష్యత్తుకు ఈశాన్య భారతం దిక్సూచిగా మారుతుందని ఇది నిరూపిస్తోంది" అని అస్సాం ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

గాంధీధామ్‌లోని డీపీఏ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కచ్ లోక్‌సభ సభ్యులు వినోద్ చావ్డా, గాంధీధామ్ ఎమ్మెల్యే మాల్తిబెన్ కిషోర్ మహేశ్వరి, అస్సాం ప్రభుత్వ రాజకీయ కార్యదర్శి తరంగా గొగోయ్, అసోం పెట్రో-కెమికల్స్ ఛైర్మన్ బికుల్ దేకా, వైస్ ఛైర్మన్ హేమంత గొగోయ్, దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ (డీపీఏ) ఛైర్మన్ సుశీల్ కుమార్ సింగ్‌తో పాటు ప్రభుత్వానికి, రెండు సంస్థలకు చెందిన ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## 2026 రబీ సీజన్ పై న్యూఢిల్లీలో రేపటి నుంచి రెండు రోజుల జాతీయ సదస్సు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, రైతు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో 2026 రబీ సీజన్ కోసం జాతీయ వ్యవసాయ సదస్సును సెప్టెంబర్ 28, 29 తేదీల్లో న్యూఢిల్లీలోని పూసా, ఎన్ఏఎస్‌సీ కాంప్లెక్స్‌లో ఉన్న భారతరత్న సి. సుబ్రమణ్యం ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సదస్సును ప్రారంభిస్తారు. రాబోయే రబీ సీజన్‌కు సంబంధించిన కీలక ప్రాధాన్య అంశాలు, సన్నద్ధతపై చర్చించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖల మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, ఐసీఏఆర్, ఇతర భాగస్వాములు ఈ సదస్సులో పాల్గొంటారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో కేంద్ర, రాష్ట్ర సమన్వయాన్ని బలోపేతం చేయడం, వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత, సుస్థిరత, రైతుల ఆదాయాలను పెంచేందుకు సమన్వయంతో కూడిన, ఫలితాల ఆధారిత వ్యూహాన్ని రూపొందించడంపై దృష్టి సారించనున్నారు. ఇటీవల నిర్వహించిన జోనల్ వ్యవసాయ సదస్సుల్లో వెలువడిన ముఖ్యమైన అనుభవాలు, ఫలితాలను కూడా ఈ చర్చల్లో పరిగణనలోకి తీసుకుంటారు. సదస్సు తొలి రోజున మూడు విస్తృత అంశాలపై ఒకే సమయంలో మూడు విడతల్లో అంశాల ఆధారిత (థీమాటిక్) గ్రూప్ చర్చలు నిర్వహించనున్నారు. వీటిలో ఆత్మనిర్భరత, పంటల వైవిధ్యీకరణ, ఉత్పత్తి పెంపు, సుస్థిరత, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వనరులు, విపత్తుల నిర్వహణ అంశాలు ఉన్నాయి. పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్ పామ్‌లో ఆత్మనిర్భరత సాధించే మిషన్, ఉద్యానవన పంటలు, పత్తి, విత్తనాల లభ్యత, విత్తన విలువ శ్రేణిలో సంస్కరణలు, ప్రకృతి వ్యవసాయం, నేల ఆరోగ్యం, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు ఉత్పత్తిదారులసంస్థ (ఎఫ్‌పీఓ) లకు ఆర్థిక సహాయం, మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ సంస్కరణలు, పీఎం ధన్?ధాన్య కృషి యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు పరిధి, డిజిటల్ వ్యవసాయం, పీఎం ఫసల్ బీమా యోజన, మొక్కల సంరక్షణ, వ్యవసాయ గణాంకాలు వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు.

రబీ సీజన్‌లో అమలు చేయాల్సిన కీలక అంశాలు, రాష్ట్రాల వారీ ప్రాధాన్యాలు, ఆచరణాత్మక వ్యూహాలను గుర్తించడం ఈ అంశాల వారీ చర్చల ప్రధాన ఉద్దేశం. వివిధ పథకాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం, సేవలను అందచేసే వ్యవస్థలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు సమర్థంగా సాధించేలా చూడడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు.

జోనల్ వ్యవసాయ సదస్సుల్లో వెలువడిన ముఖ్యమైన అనుభవాలు, తొలిరోజు నిర్వహించిన థీమాటిక్ చర్చల ఫలితాలపై సదస్సు రెండో రోజున దృష్టి సారించనున్నారు. రబీ సీజన్‌కు సంబంధించిన వాతావరణ అంచనాలు, ఎరువుల లభ్యత, ఎరువులను సమతుల్యంగా వినియోగించడం, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, రైతు రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే, అగ్రిస్టాక్, పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత సాధించే మిషన్, వంట నూనెలపై జాతీయ మిషన్, పంటలు, విత్తనాల పరిస్థితి, పంట రకాల స్వీకరణ, పీఎం ధన్ - ధాన్య కృషి యోజన, మార్కెటింగ్ సంస్కరణలు, ఏటీఎంఏ, కేవీకేల ద్వారా వ్యవసాయ ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలు రెండో రోజు ఎజెండాలో ఉంటాయి. రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులు తమ అభిప్రాయాలు, అనుభవాలు, రాష్ట్రాల ప్రాధాన్య అంశాలు, వ్యవసాయ అభివృద్ధి, రబీ సీజన్ సన్నద్ధతకు సంబంధించిన సూచనలను పంచుకునేందుకు ఈ సదస్సు అవకాశం కల్పిస్తుంది.

## భీమన్న ఆలయంలో భక్తుల సందడి



కరీంనగర్, సెప్టెంబర్ 28: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న క్షేత్రానికి తరలివచ్చారు.

తెల్లవారు జామున పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్లలో బారులు తీరారు. గర్భగుడిలో కొలువుదీరిన శ్రీ స్వామివారిని దర్శించుకున్న భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, రూ. 35 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు.

## ఈ-వ్యర్థాల తొలగింపు, పరిశుభ్రత, కార్యాలయ సామర్థ్యంపై దృష్టితో ప్రత్యేక ప్రచారం 6.0కు సన్నద్ధమైన రసాయనాలు, పెట్రోకెమికల్స్ విభాగం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28ప్రత్యేక ప్రచారం 5.0లో స్క్రాప్ తొలగింపు, స్థల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారంలో గణనీయ పురోగతి

రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని రసాయనాలు, పెట్రోకెమికల్స్ విభాగం (డీసీపీసీ) 2026 అక్టోబర్ 2 నుంచి 31 వరకు నిర్వహించనున్న ప్రత్యేక ప్రచారం 6.0కు సన్నద్ధమవుతోంది. పరిశుభ్రత, ఈ?వ్యర్థాల తొలగింపు, స్థల నిర్వహణ, కార్యాలయ సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై ఈసారి మరింత ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు నిర్వహించిన సన్నద్ధత దశలో కూడా పలు పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు.

ఆరో సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఈ ప్రచారంలో ఈ-వ్యర్థాల (నిర్వహణ) నిబంధనలు 2022, ఇతర వర్తించే మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ-వ్యర్థాలను గుర్తించి, వాటిని తొలగించడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కార్యాలయ స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం, స్క్రాప్, అవసరం లేని వస్తువులను తొలగించడం, రికార్డుల నిర్వహణ, మొత్తంగా కార్యాలయ వాతావరణాన్ని మెరుగుపరచడంపైనా దృష్టి పెట్టనున్నారు. ఈ ఏడాది ప్రచారం ఇతివృత్తం "ఈ-వ్యర్థాల సమర్థవంతమైన సేకరణ, విభజన, తొలగింపు".

రసాయనాలు, పెట్రోకెమికల్స్ విభాగం 2025 అక్టోబర్ 2 నుంచి 31 వరకు ప్రత్యేక ప్రచారం 5.0ను విజయవంతంగా నిర్వహించింది. పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారం, స్క్రాప్ తొలగింపు, కార్యాలయ స్థలాన్ని సమర్ధవంతంగా వినియోగించుకోవడం వంటి అంశాలపై ఈ ప్రచారంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ప్రత్యేక ప్రచారం 5.0లో స్క్రాప్ తొలగింపు ద్వారా రూ. 9.18 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. స్థల ఆడిట్, ఇతర చర్యల ద్వారా 7,156 చదరపు అడుగుల స్థలాన్ని ఖాళీ చేయడంతో, అందుబాటులో ఉన్న కార్యాలయ స్థలాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది.

రికార్డుల నిర్వహణలో భాగంగా 4,792 భౌతిక ఫైళ్లను పరిశీలించి, వాటిలో 237 ఫైళ్లను తొలగించారు. ఎలక్ట్రానిక్ రికార్డులు, ఈ-ఫైళ్లకు సంబంధించి 1,275 ఈ-ఫైళ్లను సమీక్షించి, వాటిలో 170 ఈ-ఫైళ్లను మూసివేశారు.

ఈ ప్రచారం సందర్భంగా విభాగానికి ప్రజల నుంచి ఆరు ఫిర్యాదులు అందగా, వాటన్నింటినీ పరిష్కరించారు. ఇది ప్రజలకు సకాలంలో, స్పందనాత్మకంగా సేవలు అందించడంపై విభాగం చూపుతున్న దృష్టిని ప్రతిబింబిస్తుంది. వీటితో పాటు ప్రచారంలో భాగంగా తొమ్మిది పార్లమెంటరీ హామీల అమలును కూడా పర్యవేక్షించారు. పాత ఫర్నిచర్, పాత రికార్డులు, ఇతర అవసరం లేని వస్తువులను తొలగించడంతో పాటు పరిశుభ్రత, స్థలాన్ని సమర్ధవంతంగా వినియోగించుకునేలా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ చర్యలు మరింత పరిశుభ్రమైన, క్రమబద్ధమైన, సమర్థవంతమైన కార్యాలయ వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి దోహదపడ్డాయి. కేంద్ర పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ సంస్థ (సీఐపీఈటీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెస్టిసైడ్ ఫార్ములేషన్ టెక్నాలజీ (ఐపీఎఫ్‌టీ), హిందుస్తాన్ ఆర్గానిక్ కెమికల్స్ లిమిటెడ్ (హెచ్ఓసీఎల్), హెచ్ఐఎల్ సహా విభాగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి సంస్థలు ఈ ప్రచారంలో చురుకుగా పాల్గొన్నాయి.

## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కారం

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




కరీంనగర్, సెప్టెంబర్ 28: ప్రజల నుంచి ప్రజావాణికి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ కె. వై ప్రసాద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములు కోల్పోతున్నాం..

**మొగుళ్లపల్లి మండల కేంద్ర భూములకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం కోరిన రైతులు**

కరీంనగర్, సెప్టెంబర్ 28:గ్రీన్‌ఫీల్డ్ హైవే?163జీ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న తమకు మార్కెట్ విలువ, భూముల అభివృద్ధి స్థాయి, పంటల దిగుబడిని పరిగణనలోకి తీసుకుని న్యాయమైన నష్టపరిహారం అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలానికి చెందిన బాధిత రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి తమ గోడును వెల్లడించారు.

మొగుళ్లపల్లి మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న తమ భూములు మూడు పంటలు పండే అత్యంత సారవంతమైనవని రైతులు తెలిపారు. గ్రామంలో గత 30 ఏళ్లుగా బీసీ సంక్షేమ హాస్టల్, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, రైస్ మిల్లులు, ఎస్‌బీఐ బ్యాంక్ వంటి ప్రభుత్వ, వాణిజ్య సంస్థలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. చుట్టుపక్కల 18 గ్రామాలకు మొగుళ్లపల్లి మండల కేంద్రంగా ఉన్నందున ఈ ప్రాంతం ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా ఉందని వివరించారు.

ఇటీవల ఐదేళ్లుగా గ్రామంలో కేజీ నుంచి పీజీ హాస్టల్ విజయవంతంగా కొనసాగుతోందని, దీనివల్ల విద్యా, మౌలిక వసతులు మరింత అభివృద్ధి చెందాయని రైతులు తెలిపారు. తమ భూములకు బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ. 1.50 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు ధర పలుకుతోందని చెప్పారు. ఇలాంటి భూములకు సాధారణ వ్యవసాయ భూముల ప్రాతిపదికన పరిహారం నిర్ణయించవద్దని కోరారు.

వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో హైవే కోసం భూములు కోల్పోయిన వారికి ఎకరాకు సుమారు రూ. 80 లక్షల నుంచి రూ. కోటి వరకు పరిహారం ఇచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రైతులు కోరారు. భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని టేకుమట్ల మండలంలో ఐదేళ్ల క్రితం గుంట భూమికి రూ. 50 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు మార్కెట్ ధర ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. మొగుళ్లపల్లి కూడా ఇదే తరహాలో వేగంగా అభివృద్ధి చెందుతున్నందున గీసుకొండ, టేకుమట్ల ప్రాంతాల్లోని భూముల విలువలను పరిగణనలోకి తీసుకుని పరిహారం నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.

భూములు కోల్పోతున్న రైతుల జీవనాధారాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చెందుతున్న మండల కేంద్ర భూములకు తగిన మార్కెట్ విలువను నిర్ధారించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో బాధిత రైతులు అడ్డూరి రాజేందర్, కొలుగూరి స్వప్న, కొలుగూరి మనోహర్‌రావు, మారయ్య, చిలకమారి రమణయ్య, మోర అనూష తదితరులు ఉన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం అక్రమాలకు వ్యతిరేకంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు నిరసన ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి సీతక్క గారు..

## కేంద్ర ఎన్నికల సంఘం అక్రమాలకు వ్యతిరేకంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు నిరసన ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క



ములుగు, సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ గారి ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం అక్రమాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క గారు పాల్గొని ఓటు చోరీ అక్రమాలకు పాల్పడిన సిఇసి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్రం పభుత్వానికి బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ములుగు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం అందించారు...

మంత్రి సీతక్క గారి వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,గుమ్మడి సోమయ్య,ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మద్దాలి నాగమణి,జిల్లా సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు,అన్ని మండలాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు,యూత్ నాయకులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వీహెచ్‌పీ మాజీ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ శతజయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మాజీ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ జయంతిని పురస్కరించుకుని ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించిన శతజయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, పూజ్యనీయులైన అశోక్ జీ శతజయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం మనందరికీ గర్వకారణమని అన్నారు. అశోక్ జీ వందేళ్ల కిందట జన్మించారని, తన జీవితంలోని ప్రతి దశలోనూ ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థిగా రాణించారని, స్వయంసేవక్‌గా విశిష్ట సేవలందించారని, ప్రచారక్‌గా కూడా తన ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ బాధ్యతలు అప్పగించిన తర్వాత, చివరి శ్వాస వరకు ఆయన అచంచలమైన నిబద్ధతతో హిందూత్వానికి అంకితమైన జీవితాన్ని కొనసాగించి తన లక్ష్యాన్ని సాధించారని అన్నారు. ఇలాంటి వ్యక్తిత్వాలు అరుదుగా కనిపిస్తాయని శ్రీ షా పేర్కొన్నారు. త్యాగం, నిరాడంబరత, అసామాన్య దేశభక్తి, ధర్మ నిబద్ధత, స్వయంసేవక్ ఆదర్శాల పట్ల అంకితభావం, పోరాట స్ఫూర్తి మొదలైన సద్గుణాలన్నీ అశోక్ జీ జీవితంలో సమాహారమై ఉన్నాయని శ్రీ షా అన్నారు. అత్యంత గౌరవప్రతిష్ఠలు, సంపద కలిగిన కుటుంబంలో జన్మించినప్పటికీ శ్రీ అశోక్ తన జీవన విధానంలో నిరాడంబరతను చివరి వరకు పాటించారని, దాని ఫలితాన్ని నేడు మనం చూస్తున్నామని శ్రీ అమిత్ షా అన్నారు. ఐదున్నర శతాబ్దాలుగా మొత్తం హిందూ సమాజం త్యాగాలు చేస్తూ, పోరాడుతూ, ఏకమై ఎదురుచూసిన రామ జన్మభూమి మందిర నిర్మాణాన్ని మనం నేడు సాకారం చేసుకున్నామని శ్రీ షా అన్నారు. అశోక్ జీ తన జీవితంలో 20 సంవత్సరాలు గడిపిన వీహెచ్‌పీ కార్యాలయంలోని గది నేడు దాదాపు కార్యకర్తలకు ఒక స్ఫూర్తిదాయక ప్రదర్శనశాలగా మారిందని తెలిపారు. అంతటి నిరాడంబరమైన జీవితం గడుపుతూ, ఆదర్శప్రాయమైన దేశభక్తిని నిలబెట్టుకోవడం నిజంగా అరుదైన విషయమని శ్రీ షా పేర్కొన్నారు. వయసు మీద పడిన తరువాత కూడా అశోక్ జీ రోజుకు పదహారు గంటలు పనిచేసేవారని శ్రీ అమిత్ షా అన్నారు. ఆయనకు ఏకైక ప్రేరణ ఆదర్శప్రాయమైన దేశభక్తేనని పేర్కొన్నారు. హిందూ ధర్మం, వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృతం, భారతీయ సంస్కృతి, సాధు సంతుల సంప్రదాయం పట్ల అశోక్ జీకి అపారమైన గౌరవం ఉండేదని తెలిపారు. జీవితాంతం వీటన్నింటి పట్ల ఆయన లోతైన భక్తి, గౌరవభావాలను కొనసాగించారని అన్నారు. సమస్త విశ్వ సంక్షేమానికి ఎవరైనా లేదా ఏదైనా తోడ్పడగలిగితే అది హిందూ ధర్మం, వేదాలు, ఉపనిషత్తులేనని ఆయన విశ్వసించేవారని శ్రీ షా పేర్కొన్నారు. శాంతి మంత్రాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, హిందూ ధర్మ ప్రతిష్ఠను పెంచి, దానిని ప్రపంచవ్యాప్తంగా స్థాపించాలన్న లక్ష్యం కేవలం మనం హిందువులం కాబట్టి కాదని, హిందూ ధర్మం సమస్త విశ్వ సంక్షేమాన్ని కాంక్షిస్తుంది కాబట్టేనని ఆయన స్పష్టం చేశారు. గురు గోల్వాల్కర్ చెప్పినట్లుగా మన లక్ష్యానికి పునాది నిస్వార్థమైన, స్వచ్ఛమైన ప్రేమ మాత్రమే కావాలని, మరేదీ కాదని ఆయన పేర్కొన్నారు. అలాంటి ఉన్నత వ్యక్తిత్వం తోనే ఆయన జీవితాంతం స్వయంసేవక్‌గానే కొనసాగారని అన్నారు. అశోక్ జీ ఎలాంటి ప్రశంసలు, ప్రచారం కోరుకోకుండా ప్రచారక్ జీవితంలోని ప్రతి నియమాన్ని నిబద్ధతతో పాటించారని శ్రీ షా తెలిపారు.

పోరాటం విషయానికి వస్తే అశోక్ జీ పోరాట స్ఫూర్తి గురించి అందరికీ తెలుసునని అన్నారు. రామ జన్మభూమి ఉద్యమం ఆయన హృదయంలో, ఆలోచనల్లో బలంగా నాటుకుపోయిందని పేర్కొన్నారు. బానిసత్వపు కళంకాన్ని తొలగించి, భవ్యమైన రామ మందిరాన్ని నిర్మించినప్పుడే భారత్ ప్రపంచంలో వైభవం, గౌరవప్రతిష్ఠలు కలిగిన స్థానాన్ని పొందగలదని ఆయన దృఢంగా విశ్వసించారని తెలిపారు. రామ జన్మభూమి ఉద్యమానికి ఆయన తన జీవితాన్నంతటినీ అంకితం చేశారని అన్నారు. అప్పటి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం లాఠీచార్జికి ఆదేశించినప్పుడు, అశోక్ జీ మారువేషంలో ముందు వరుసలోకి వెళ్లారని శ్రీ షా తెలిపారు. ఆ లాఠీచార్జిలో ఆయన కూడా గాయపడ్డారని పేర్కొన్నారు. అశోక్ జీ తన ముఖం నుంచి కారుతున్న రక్తాన్ని గమ్ఛాతో తుడుచుకుంటున్న దృశ్యం రాబోయే వందేళ్ల పాటు యువత జ్ఞాపకాల్లో చెరగని ముద్రగా నిలవాలని అన్నారు. నిజమైన అంకితభావం అంటే ఏమిటో అశోక్ జీ జీవితం, ఆయన కార్యాచరణ స్పష్టంగా తెలియజేస్తాయని శ్రీ షా పేర్కొన్నారు.

సాధు సంతుల సంస్థ విశ్వ హిందూ పరిషత్, రామ జన్మభూమి ఉద్యమం, రామ మందిర నిర్మాణం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వంటి అంశాలు అశోక్ జీ హృదయానికి అత్యంత సన్నిహితమైనవని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ అంశాలపై ఆయన ఎప్పుడూ బహిరంగంగా మాట్లాడటంతో పాటు, వాటి అభివృద్ధి, పురోగతి కోసం కృషి చేశారని తెలిపారు. ఈ సంస్థలు, ఉద్యమాలన్నీ క్రమంగా ఆయన వ్యక్తిత్వానికి ప్రతిరూపాలుగా మారాయని పేర్కొన్నారు. అశోక్ జీ స్వయంగా ఒక సంస్థగా నిలిచారని శ్రీ షా అన్నారు. అశోక్ జీ శత జయంతి వేడుకలు అనేకమంది యువకులకు వారి జీవితాంతం స్ఫూర్తినిచ్చే మూలంగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన జీవిత సారం, ఆయన తపస్సు, ఆయన సరళత, ఆయన అంకితభావం, కృషి ప్రతి యువకుడూ ఆదర్శంగా తీసుకోవాల్సిన సద్గుణాలని అన్నారు. అశోక్ జీ జీవితం సహజంగానే యువతలో స్ఫూర్తిని రగిలిస్తూ, వారిని నిరంతరం ప్రేరేపిస్తుందని శ్రీ షా పేర్కొన్నారు.

అశోక్ జీ వ్యక్తిగత జీవితం, ప్రజా జీవితం మధ్య ఎలాంటి భేదం ఉండేది కాదని అన్నారు. దేశం కోసం జీవించాలనే ఆదర్శాన్ని ఆయన తన జీవితంలో అంతర్భాగంగా చేసుకుని తన వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా ఆ సూత్రంతో మమేకం చేశారని పేర్కొన్నారు. సంస్థ పనులను ఒక ఆధ్యాత్మిక సాధనగా భావించి స్వీకరించారని తెలిపారు. అశోక్ జీ పేరును కేవలం గుర్తుంచుకోవడమే ఈ కార్యక్రమ ఉద్దేశం కాదని, ఆయన విశిష్ట గుణాలను ప్రతి ఇంటికి, ముఖ్యంగా యువత వద్దకు తీసుకెళ్లడమే ఈ శత జయంతి సంవత్సర ప్రయత్నమని చెప్పారు. ప్రచారాన్ని కోరుకోని వ్యక్తికి శత జయంతి వేడుకలను జరపాల్సిన అవసరం ఏమిటని కొందరు కొందరు అడుగుతున్నారని, "కృతజ్ఞత అనేది కేవలం ఒక భావోద్వేగం కాదు; అది జాతీయ అవసరం" అని శ్రీ షా అన్నారు. అశోక్ జీ పట్ల దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు తమ కృతజ్ఞతను వ్యక్తం చేసేందుకు ఆయన శతజయంతి నిర్వహించడం అవసరమని శ్రీ అమిత్ షా అన్నారు. ఒక దేశం, సమాజం తమ మహనీయులను స్మరించుకోకుండా, వారి జీవితాలు, బోధనలను యువతకు చేరవేయడంలో విఫలమైనప్పుడు భావజాల శూన్యత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆదర్శంగా తీసుకునే వ్యక్తులు, అనుసరించాల్సిన దిశ, స్ఫూర్తిని పొందేందుకు ఆధారం లేనప్పుడు ప్రజలు వేల కిలోమీటర్ల దూరంలోని ఇతర నాగరికతల్లో తమ ఆదర్శాలను వెతుక్కోవడం ప్రారంభిస్తారని తెలిపారు. అందువల్ల సమాజంలో భావజాల శూన్యత ఏర్పడకుండా చూడటం, ప్రజల ముందు అనుసరణీయమైన ఆదర్శాలను ఉంచడం, అశోక్ జీ జీవితం నుంచి దిశానిర్దేశం, స్ఫూర్తి పొందేలా చేయడం ఎంతో అవసరమని శ్రీ షా పేర్కొన్నారు. అందుకే ఆయన శతజయంతి ఉత్సవాలను నిర్వహించడం అత్యంత ముఖ్యమని అన్నారు.

హిందూత్వ సారాన్ని ప్రతిబింబించే పలు సేవా కార్యక్రమాల ప్రదర్శనలను నేడు వీక్షించామని శ్రీ షా అన్నారు. సంత్ రవిదాస్, మహర్షి వాల్మీకి ఆలయాల్లో ప్రార్థనలు, ప్రయాగ్‌రాజ్‌లో గంగా హారతి, గంగా పరిరక్షణ, గోమాత సేవ, రామసేతు ఉద్యమ స్మరణ, అయోధ్యలో కృత్రిమ అవయవాల పంపిణీ వంటి కార్యక్రమాలు ఇందులో ఉన్నాయని తెలిపారు. అలాగే, 11 శ్రీరామ స్తంభాలను డిజిటల్‌గా ప్రారంభించామని శ్రీ షా పేర్కొన్నారు. వనవాస సమయంలో శ్రీరాముడు సాగిన మార్గానికి ఈ స్తంభాలు గుర్తుగా నిలుస్తాయని తెలిపారు. ఒక్క మాట కూడా పలకకుండానే, ఈ స్తంభాలు రాబోయే తరాలకు రామ వనగమన మార్గం, శ్రీరాముని సద్గుణాల సందేశాన్ని చేరవేస్తాయని అన్నారు.

రామ జన్మభూమి ఉద్యమం కోసం తనను పూర్తిగా అంకితం చేసుకున్న అశోక్ జీ భూమిపూజను చూడలేకపోవడం, ఆలయ నిర్మాణం పూర్తవడాన్ని ప్రత్యక్షంగా వీక్షించలేకపోవడం బాధాకరమని అన్నారు. అయితే, తన కృషి ఫలితాన్ని తన జీవితకాలంలోనే చూడాలన్న ఉద్దేశంతో ఆయన ఎప్పుడూ పనిచేయలేదని పేర్కొన్నారు. ఇది తరతరాలుగా కొనసాగే పోరాటమని ఆయన ఎప్పుడూ చెప్పేవారని తెలిపారు. ఎందరో పోరాడతారని, అనేక తరాలు గడిచిన తర్వాతే విజయం సాధ్యమవుతుందని అశోక్ జీ చెప్పేవారని శ్రీ షా అన్నారు. 2014లో దేశంలో చోటుచేసుకున్న మార్పు పాలన దిశనే మార్చిందన్న విషయాన్ని అశోక్ జీ ఆత్మ ఎక్కడ ఉన్నా తప్పకుండా అనుభూతి చెందుతూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత, కేవలం ఐదేళ్లలోనే ప్రభుత్వపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయాయని, ఎలాంటి రక్తపాతం లేకుండా ప్రభు శ్రీరాముని భవ్యమైన ఆలయం నిర్మితమైందని ఆయన అన్నారు. ఇది దేశానికి మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీరాముని భక్తులందరికీ శాంతి, సంతృప్తిని కలిగించే విషయమని ఆయన పేర్కొన్నారు.

రామ మందిర నిర్మాణం భారత్ ప్రగతికి కొత్త మార్గాన్ని తెరుస్తుందన్న అశోక్ జీ విశ్వాసాన్ని తాను కూడా పంచుకుంటున్నానని అన్నారు. మన ఆలోచనలు, మన సంస్కృతి, మన ధర్మం, దాని సద్గుణాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు చేరుతాయని పేర్కొన్నారు. హిందూత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలని అశోక్ జీ విశ్వసించేవారని, హిందూత్వ ఆదర్శాల ఆధారంగానే సమస్త విశ్వ సంక్షేమం సాధ్యమవుతుందని ఆయన నమ్మేవారని శ్రీ షా తెలిపారు. రాబోయే తరాల్లోనూ దేశ యువత అశోక్ జీ వ్యక్తిత్వం, జీవితం, సేవలు, మాటల నుంచి విలువలను, స్ఫూర్తిని పొందుతూనే ఉంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# జాతీయ భద్రతకు జాతీయ ఐక్యతే కీలకం: శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన రక్షణ సదస్సులో ప్రసంగిస్తూ... "భారత్ శాంతిని విశ్వసిస్తుంది. ఏ దేశ భూభాగాన్ని ఆక్రమించాలని కోరుకోదు. శాంతిని బలహీనతగా భావించకూడదు. మేం ప్రపంచ స్థిరత్వాన్ని కోరుకుంటాం. అయితే మా వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని పణంగా పెట్టి కాదు. ముప్పు వాటిల్లినప్పుడు మా భద్రతను, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికి మేం దృఢంగా కట్టుబడి ఉన్నాం" అని వ్యాఖ్యానించారు.

భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఏ దేశంతోనూ చర్చలకు తావులేదని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. "ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వ విధానంగా మార్చుకుని, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతునిస్తున్న దేశాలకు... ఉగ్రవాదం ఏ దేశానికీ వ్యూహాత్మక ఆస్తి కాలేదని గట్టిగా గుర్తుచేయాల్సిన అవసరం ఉంది. పొరుగు దేశం ఉగ్రవాదానికి మద్దతునిచ్చే విధానాన్ని కొనసాగించినంత కాలం, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకునే పూర్తి హక్కు భారత్‌కు ఉంటుంది" అని పేర్కొన్న రక్షణ మంత్రి, ఇటీవల జరిగిన ఎస్‌సీవో సమావేశంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రస్తావించారు.

జాతీయ భద్రతకు జాతీయ ఐక్యతే కీలకమని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. దేశ భద్రత కేవలం సాయుధ దళాల బాధ్యత మాత్రమే కాదనీ, ప్రతి పౌరుడి ఉమ్మడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. మతం, కులం, జాతి, భాష, ప్రాంతం, ఇతర విభేదాలకు అతీతంగా పౌరులంతా ఉన్నత స్థాయికి ఎదగాలి. వ్యక్తిగత, సంకుచిత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యమివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

భారత్‌ను గొప్ప నాగరికతా శక్తిగా శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. ఒక దేశం ఎదుగుదల ఇతర దేశాలతో ఘర్షణలు, ఆ దేశాలను విచ్ఛిన్నం చేయడంపై కాకుండా.. అందరినీ కలుపుకొనిపోయే సమష్టి అభివృద్ధిపైనే ఆధారపడి ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్ అనుసరించే విధానానికి మూడు పునాదులు ఉన్నాయని తెలిపారు. మన సుదీర్ఘ ప్రజాస్వామ్యం, సాంస్కృతిక సంప్రదాయాలు... 'వసుధైవ కుటుంబకం' అనే మన సిద్ధాంతం... 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' అనే మన సంకల్పం ఆ మూడు పునాదులని కేంద్ర మంత్రి వివరించారు. వీటితో పాటు గౌరవం, చర్చలు, సంపద, భద్రత, సంస్కృతి అనే ఐదు వ్యూహాత్మక స్తంభాలు భారత్ కోసం మార్గదర్శకాలని ఆయన గుర్తుచేశారు.

గ్లోబల్ సౌత్ కూటమిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ... ఒక విశ్వసనీయ భాగస్వామిగా, 'విశ్వ బంధు'గా భారత్ ప్రస్తుతం అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషిస్తున్నదని రక్షణ మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. 'వాక్సిన్ మైత్రి' కార్యక్రమం కింద 100కు పైగా దేశాలకు 30 కోట్లకు పైగా కోవిడ్-19 వ్యాక్సిన్ డోసులను భారత్ సరఫరా చేసిందని తెలిపారు. మందులు, డిజిటల్ చెల్లింపుల సాంకేతికత, నైపుణ్యం, వనరుల ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత్ అండగా నిలిచిందనీ ఆయన గుర్తుచేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ సమిట్స్' వంటి కార్యక్రమాలనూ ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. బాధ్యతాయుతంగా అధికారాన్ని వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేస్తూ... పోటీ ఉన్నప్పటికీ దేశాల మధ్య పరస్పర సహకారం ఉండాలనీ, ప్రపంచ అభివృద్ధిలో అందరినీ కలుపుకొనిపోయే భాగస్వామ్యం అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధన దిశగా భారత్ సాధించిన అద్భుతమైన ప్రగతిని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రముఖంగా ప్రస్తావించారు. విమానాలు, డ్రోన్ ఇంజిన్ల నుంచి అయిదో, ఆరో తరం ఫైటర్ జెట్ల వరకు మన దేశం సొంతంగానే సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. భారత్ రక్షణ ఎగుమతులు 2013–14లో కేవలం రూ. 686 కోట్లు మాత్రమే ఉండగా... 2025–26 నాటికి రికార్డు స్థాయిలో రూ. 38,424 కోట్లకు చేరి, 100కు పైగా దేశాలకు విస్తరించాయన్నారు. గతేడాది రూ. 30,000 కోట్ల ఎగుమతుల లక్ష్యాన్ని విజయవంతంగా అధిగమించిన భారత్, 2029 నాటికి రూ. 50,000 కోట్ల ఎగుమతుల లక్ష్యాన్ని నిర్దేశించుకుందని ఆయన వెల్లడించారు.

భారత క్షిపణులు, రాడార్లు, మందుగుండు సామగ్రి, రక్షణ ప్లాట్‌ఫారమ్‌లకు అంతర్జాతీయంగా పెరుగుతున్న డిమాండ్.. భారత సాంకేతికత, నాణ్యత, సరఫరా సామర్థ్యాలపై ప్రపంచానికి ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఫలితంగా, "మేడ్ ఇన్ ఇండియా" నినాదం కేవలం ఒక తయారీ లేబుల్‌గా మాత్రమే కాదు... భారత రక్షణ రంగ సామర్థ్యాలపై ప్రపంచానికి గల గొప్ప నమ్మకానికి చిహ్నంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు.

రక్షణ రంగానికి కేటాయించే బడ్జెట్ గణనీయంగా పెరుగుతోందని రక్షణ మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. 2013–14లో రక్షణ రంగ బడ్జెట్ దాదాపు రూ. 2.53 లక్షల కోట్లుగా ఉందనీ... 2026–27 నాటికి అది రూ. 7.85 లక్షల కోట్లకు చేరిందనీ ఆయన పేర్కొన్నారు. పెట్టుబడి సేకరణ బడ్జెట్‌లో సుమారు 75 శాతం అంటే రూ. 1.39 లక్షల కోట్లను కేవలం స్వదేశీ రక్షణ పరిశ్రమల నుంచి కొనుగోలు చేయడానికి కేటాయించామనీ, దీనివల్ల స్థానిక తయారీ రంగంతో పాటు దానికి అనుబంధంగా ఉన్న ఎంఎస్‌ఎంఈలు, సరుకు రవాణా వ్యవస్థలూ మరింత బలోపేతం అవుతాయని కేంద్ర మంత్రి వివరించారు.

యుద్ధాల స్వభావం వేగంగా మారుతోందనీ, ఆధునిక ఘర్షణలు సాంప్రదాయిక సరిహద్దులకే పరిమితం కాకుండా సైబర్, అంతరిక్షం, ఎలక్ట్రానిక్- ఇన్ఫర్మేషన్ వార్‌ఫేర్ వంటి రంగాలకూ విస్తరిస్తున్నాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వీటితో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు, స్వయం-ప్రతిపత్తి గల సిస్టమ్స్, క్వాంటం టెక్నాలజీ, హైపర్సోనిక్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలూ దీనికి తోడవుతున్నాయని ఆయన వివరించారు. ఈ మారుతున్న కాలానికి అనుగుణంగా, అన్ని రంగాల్లో భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా సరికొత్త సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

సాంకేతికత, ఇంధనం, డేటా, సరుకు రవాణా వ్యవస్థల వంటి రంగాల్లోని వ్యూహాత్మక బలహీనతలను అధిగమించడానికి దేశం చేస్తున్న కృషిని రక్షణ మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. సెమీకండక్టర్లు, కీలకమైన ఖనిజాల విభాగాల్లో స్వదేశీ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, పలు రకాల ఇంధన వనరులను అందుబాటులో ఉంచడం ద్వారా ఇంధన భద్రతను మరింత పటిష్ఠం చేయడానికి సంబంధించి విస్తృత చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి ప్రాముఖ్యతను రక్షణ మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. మన సాయుధ దళాలు విడుదల చేసిన అయిదు సానుకూల స్వదేశీకరణ జాబితాల్లో... 509 రక్షణ పరికరాలు, ఆయుధ వ్యవస్థలు, ప్లాట్‌ఫారమ్‌లను చేర్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ రక్షణ రంగ సంస్థలు (డీపీఎస్‌యూలు) మరో ఆరు స్వదేశీకరణ జాబితాలను విడుదల చేశాయన్నారు. వీటిలో వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఎల్‌ఆర్‌యూలు, సబ్-సిస్టమ్స్, స్పేర్స్, విడిభాగాలు కలిపి మొత్తం 5,417 వస్తువులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వీటిలో ఇప్పటికే సుమారు 3,300 వస్తువులను విజయవంతంగా స్వదేశీ సాంకేతికతతోనే తయారు చేసినట్లు రక్షణ మంత్రి వెల్లడించారు.

రక్షణ రంగ తయారీలో ప్రైవేట్ రంగం, అంకురసంస్థలు, ఎంఎస్‌ఎంఈల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతోందని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రస్తుతం భారత రక్షణ వ్యవస్థలో ప్రభుత్వ రక్షణ రంగ సంస్థలతో పాటు, ప్రైవేటు పరిశ్రమలు, 16,000కు పైగా ఎంఎస్‌ఎంఈలు, అంకుర సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లో రక్షణ రంగానికి సంబంధించిన తయారీ సామర్థ్యాలు వేగంగా విస్తరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు రక్షణ పారిశ్రామిక కారిడార్లలో దాదాపు రూ. 70,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయనీ, అందులో ఇప్పటికే సుమారు రూ. 10,000 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్లు రక్షణ మంత్రి వెల్లడించారు.

స్వదేశీ రక్షణ వస్తువుల సరఫరా వ్యవస్థల బలోపేతంలో 'సృజన్', 'సృజన్ దీప్' పోర్టల్‌ల పాత్రనూ రక్షణ మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. సృజన్ పోర్టల్ ద్వారా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే దాదాపు 33,000 వస్తువులను గుర్తించి, వాటి స్థానంలో స్వదేశీ వస్తువులను వాడాలని నిర్ణయించామన్నారు. వాటిలో ఇప్పటికే సుమారు 15,700 వస్తువులను సొంతంగానే తయారు చేసుకుంటున్నామనీ ఆయన తెలిపారు. 'సృజన్ దీప్' పోర్టల్ ద్వారా 40,000 కంటే ఎక్కువ మంది రక్షణ రంగ తయారీదారులు, విక్రేతలు, లక్షలాది ఉత్పత్తుల వివరాలతో ఒక జాతీయ డిజిటల్ డేటాబేస్‌ను రూపొందించినట్లు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు

ప్రభుత్వ రక్షణ రంగ సంస్థలు, ఆయుధ కర్మాగారాల వ్యవస్థలో వచ్చిన విప్లవాత్మక మార్పులను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా గుర్తుచేశారు. ఆయుధ కర్మాగారాలను కార్పొరేట్ సంస్థలుగా మార్చడం వల్ల వాటిలో సరికొత్త సాంకేతికత వాడకం, ఉత్పాదకత, జవాబుదారీతనం గణనీయంగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలోని మొత్తం 16 ప్రభుత్వ రక్షణ రంగ సంస్థలు ఎలాంటి నష్టాలు లేకుండా విజయవంతంగా నడుస్తున్నాయనీ, ఇవన్నీ ఇప్పుడు పరిశోధనాభివృద్ధి, ఎగుమతులపై మరింతగా దృష్టి సారిస్తున్నాయని రక్షణ మంత్రి స్పష్టం చేశారు.

రక్షణ రంగంలో యువత, ఆవిష్కరణల పాత్రను ప్రముఖంగా ప్రస్తావిస్తూ... ఐడెక్స్, ఐడెక్స్-ప్రైమ్ కార్యక్రమాలు జాతీయ భద్రతలో అంకురసంస్థలు, నూతన ఆవిష్కర్తలు భాగస్వాములయ్యేందుకు గొప్ప అవకాశాలను కల్పిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. 'అదితి' వంటి పథకాలు అత్యాధునిక రక్షణ సాంకేతికతలను ప్రోత్సహిస్తున్నాయని రక్షణ మంత్రి తెలిపారు. 2026 మార్చి నాటికి, ఐడెక్స్ ద్వారా 676 అంకురసంస్థలు, ఆవిష్కర్తలు రక్షణ రంగంతో అనుసంధానమయ్యారనీ, వీటి ద్వారా 551 ఒప్పందాలు జరిగాయని ఆయన వెల్లడించారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు అంకురసంస్థలు/ఎంఎస్‌ఎంఈల నుంచి రూ. 2,400 కోట్లకు పైగా విలువైన కొనుగోళ్లకు ఆమోదం తెలిపిందనీ, రూ. 1,500 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులనూ మంజూరు చేసిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

ఈ సదస్సులో రక్షణ మంత్రి ఒక కీలక ప్రకటన చేశారు. సాంప్రదాయిక క్షిపణి వ్యవస్థల కోసం డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన సాంకేతికతలను, అర్హత కలిగిన భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల ఎంపికైన ప్రైవేట్ కంపెనీలూ నిబంధనలకు లోబడి క్షిపణుల ఉత్పత్తిని చేపట్టేందుకు వీలుంటుంది. ఈ చర్య మన సాయుధ దళాల సన్నద్ధతను మరింత బలోపేతం చేయడమే కాకుండా, క్షిపణులను సకాలంలో సరఫరా చేయడానికీ దోహదపడుతుందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. డీఆర్‌డీవో ఇకపై పరిశోధనాభివృద్ధిపైనే పూర్తి దృష్టి పెట్టేలా, రక్షణ రంగ పరిశ్రమలు ఉత్పత్తిలో మరింత కీలక పాత్రను పోషించేలా వ్యూహాత్మకంగా మార్పులు చేస్తున్నట్లు ఆయన జోడించారు.

రక్షణ రంగానికి సంబంధించిన ప్రతి చిన్న విడిభాగం నుంచి పూర్తి స్థాయి ఆయుధ వ్యవస్థల వరకు... అన్ని విభాగాల్లోనూ స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించుకోవడం భారత్ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ రక్షణ మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. ఇతర దేశాల నుంచి దిగుమతులపై ఆధారపడకుండా, రక్షణ సాంకేతికతలను మన దేశంలోనే సొంతంగా అభివృద్ధి చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం దేశ వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని, రక్షణ రంగ సన్నద్ధతను, ఎలాంటి సవాళ్లనైనా తట్టుకోగల బలమైన స్వదేశీ రక్షణ-పారిశ్రామిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని రక్షణ మంత్రి వివరించారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంత్రి సీతక్క హామీ



ములుగు, సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): జర్నలిస్టులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ములుగు నూతన కలెక్టరేట్‌లో సోమవారం మంత్రి సీతక్కను ప్రింట్ మీడియా మిత్రులు కలిసి తమ సమస్యలను వివరించి ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ,ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి తొందరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించడంతో ఇళ్ల స్థలాల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల్లో ఆశాభావం వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా జర్నలిస్టులు బొమ్మన బోయిన పృథ్వీరాజ్, రామిడి కృష్ణారెడ్డి, గండ్రకోట విష్ణు, కొమురయ్య, జాలిగం శ్రీనివాస్, బిక్కనూరి సుమన్, రాజవర్ధన్, శంకర్, గంగాధర్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సాయిబాబా జన్మదినోత్సవ వేడుకలు



నల్గొండ, సెప్టెంబర్ 28: కలియుగ దైవం సాయిబాబా జన్మదినోత్సవ వేడుకలను నేరేడుచర్లలోని సాయిబాబా ఆలయంలో సోమవారం వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి క్యూకట్టారు.

ఆలయ పూజారులు రవికుమార శర్మ, ఉగ్రదండి శివప్రసాద శర్మల ఆధ్వర్యంలో బాబావారి మూల విరాట్‌కు పాలాభిషేకాలు, పంచామృతాభిషేకాలతో అభిషేకించి రంగురంగుల పూలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం మంగళహారతి కాకడ హారతి మొదలుకొని మధ్యాహ్నం వేళల్లో ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అంటూ భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వామివారికి విశేష హారతులు సమర్పించారు. అనంతరం స్థానిక ప్రముఖ వ్యాపారవేత్తలు భువనగిరి అంజయ్య కళావతి, గజవల్లి వెంకటేశ్వర్లు నాగలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు గుండా సత్యనారాయణ పద్మావతి రాచకొండ శ్రీనివాసరావు పావని దంపతులు ఆలయంలో పూల అలంకరణకు ఆర్థిక సహకారం అందజేశారు. దాతలందరిని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాచకొండ రామ కోటేశ్వరరావు పట్టు శాలువాలతో సన్మానించారు. అలాగే, మున్సిపాలిటీ పరిధిలోని పాత నేరేడుచర్లకు చెందిన కట్టా వెంకటరెడ్డి అరుణ దంపతుల కుమారుడు సాయి వినీత్ రెడ్డి కుమార్తె శివాని రెడ్డిలు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయం ప్రాంగణంలోని శివాలయం, సాయిబాబా ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలకు రంగులు వేసేందుకు రూ. 2 లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు

# అహ్మదాబాద్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్ వేదికగా రూ. 1,472 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్ వేదికగా కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి ఈ రోజు రూ. 1,472 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. దేశంలోని మొట్టమొదటి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలును కూడా ఆయన ప్రారంభించారు. రైల్వే లోకోమోటివ్ ఇంజిన్ల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన డబ్ల్యూఏజీ-12 మెయింటెనెన్స్ షెడ్‌ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, ప్రయాణికుల సౌకర్యాలు, రైలు ప్రయాణికుల భద్రతపై దృష్టి సారిస్తూ సబర్మతి డివిజన్‌లో ఈ రోజు అనేక రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించినట్లు తెలిపారు. సత్యాగ్రహం, సాదాసీదా జీవనం, గ్రామీణాభివృద్ధి, ఖాదీ.. ఈ ప్రయోగాలన్నింటినీ క్షేత్రస్థాయిలో ఆచరణలోకి తెచ్చే ప్రయాణం సబర్మతి నుంచే ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. సబర్మతి రైల్వే స్టేషన్ ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందిందన్న ఆయన.. 1980లలో ప్రయాణికులు స్టేషన్ నుంచి రిక్షా దొరకాలన్నా దాదాపు రెండు కిలోమీటర్లు నడవాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రయాణికుల సౌకర్యాలు, భద్రత, కనెక్టివిటీ పరంగా సబర్మతి రైల్వే స్టేషన్ ఒక పెద్ద పరివర్తనను చూసిందని ఆయన అన్నారు. రూ. 1,472 కోట్ల వ్యయంతో ఈ రోజు ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు రాబోయే రోజుల్లో ఈ ప్రాంతానికి ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటాయని ఆయన తెలిపారు. రైల్వే లోకోమోటివ్ ఇంజిన్ల నిర్వహణ కోసం ఇక్కడ రూ. 700 కోట్ల వ్యయంతో డబ్ల్యూఏజీ-12 మెయింటెనెన్స్ షెడ్ నిర్మించినట్లు ఆయన వెల్లడించారు. భద్రతను మరింత మెరుగుపరచడానికి రూ. 48 కోట్ల వ్యయంతో సబర్మతి-కలోల్-సబర్మతి రైలు మార్గంలో 'కవచ్' రక్షణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అహ్మదాబాద్-పాలన్‌పూర్, అహ్మదాబాద్-సమఖియాలి రైలు మార్గాల్లో 'కవచ్' వ్యవస్థను అమలు చేసే పనులతో పాటు సబర్మతి-సార్ఖేజ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులను కూడా ప్రారంభించారు.

12,000 హార్స్‌పవర్ సామర్థ్యం గల రెండు విభాగాల ఇంజిన్‌ను ఈ రోజు జాతికి అంకితం చేసినట్లు తెలిపిన కేంద్ర హోం మంత్రి.. ఇది దాదాపు 600 ట్రక్కులు మోయగల సరుకును ఏకైక ఇంజిన్‌తో రవాణా చేయగలదని అన్నారు. గతంలో ఈ పని కోసం రెండు లోకోమోటివ్‌లు అవసరమయ్యేవి కానీ ఇప్పుడు ఒకే డబ్ల్యూఏజీ-12 ఇంజిన్ ఆ పనిని పూర్తి చేయగలదు. భారతీయ రైల్వే చరిత్రలో ఇది ఒక ముఖ్యమైన ఘట్టమని ఆయన పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాల్లో పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడే ఎల్ఎన్‌జీ ఆధారిత రైలును కూడా ఈ రోజు ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు.

2014లో శ్రీ నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత రైల్వే రంగంలో అనేక కొత్త సౌకర్యాలు వచ్చాయని.. రైల్వే నెట్‌వర్క్ ఆధునికీకరణ జరిగినట్లు కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. ముంబయిలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ (జేఎన్‌పీటీ) నుంచి వడోదర వరకు దేశపు మొట్టమొదటి డబుల్-స్టాక్ లాంగ్-హాల్ కంటైనర్ రైలు విజయవంతమైన ట్రయల్ రన్ పూర్తి చేసుకుందని ఆయన తెలిపారు. దేశంలో సరుకు రవాణాకు పరిమితమైన రైలు మార్గాలు ఉన్నాయని.. అయితే డబుల్-స్టాక్ సరుకు రవాణా రైళ్ల భావన విజయవంతమైతే సరుకు రవాణా సామర్థ్యం దాదాపు రెట్టింపు అవుతుందని ఆయన చెప్పారు. ఇప్పుడు 11,000 కిలోమీటర్ల పొడవైన కారిడార్‌ను నాలుగు ట్రాక్‌లు ఉన్న నెట్‌వర్క్‌గా మారుస్తున్నట్లు తెలిపిన ఆయన. ఇది ఢిల్లీ-హౌరా, ఢిల్లీ-గౌహతి వైపు రవాణా రాకపోకలను గణనీయంగా సులభతరం చేస్తుందని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోనే ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, రాపిడ్ రైల్ సిస్టమ్, ప్రీమియం రైల్వే స్టేషన్లు ప్రవేశపెట్టినట్లు శ్రీ అమిత్ షా అన్నారు. ఇటీవలే ప్రధానమంత్రి మోదీ హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రారంభించారని.. ఈ సాంకేతికతను కలిగి ఉన్న ప్రపంచంలోని నాలుగో దేశంగా భారత్ నిలిచిందని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో 97 శాతం బయో-టాయిలెట్ల ఏర్పాటుకావటంతో పాటు 87 శాతం ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు భారత్‌లో తయారయ్యాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించడానికి ముందు రైల్వే విద్యుదీకరణ కేవలం 30 శాతంగా మాత్రమే ఉండేది.. మిగిలిన 70 శాతం పనులు ఆయన హయాంలోనే పూర్తయ్యాయి. మోదీ ప్రభుత్వ కాలంలో రైల్వే భద్రతా బడ్జెట్ 67 శాతం పెరిగిందన్న కేంద్ర హోం మంత్రి.. లోకోమోటివ్ ఉత్పత్తి సామర్థ్యం 66 శాతం పెరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'భారత్‌లో తయారీ', 'ఆత్మనిర్భర్ భారత్' భావనలను ప్రారంభించారని దాని ఫలితంగా లోకోమోటివ్‌ల వంటి పరికరాలను దేశీయంగానే తయారు చేసే దిశగా దేశం ఇప్పుడు అద్భుతమైన పురోగతి సాధించిందని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. 2015-16లో రైల్వే శాఖ 293 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగించగా 2024-25 నాటికి అది 108 కోట్ల లీటర్లకు తగ్గింది. ఇది పెద్దగా ఎవరి దృష్టికి రాని ఒక గొప్ప విజయమని ఆయన చెప్పారు. 2010-11లో ఏడాది మొత్తంలో కేవలం 75 కిలోమీటర్ల రైల్వే విద్యుదీకరణ మాత్రమే జరిగిందని.. 2023-24లో ఒక్క సంవత్సరంలోనే 7,188 కిలోమీటర్ల విద్యుదీకరణ పూర్తయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు 99.6 శాతం రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ పూర్తయిందని.. మిగిలిన 0.4 శాతం పనులు కూడా త్వరలోనే పూర్తవుతాయని ఆయన వెల్లడించారు. రైల్వే విద్యుదీకరణ చైనాలో 92 శాతం, స్పెయిన్‌లో 68 శాతం, ఫ్రాన్స్‌లో 60 శాతం, చిన్న దేశమైన బ్రిటన్‌లో 49 శాతంగా ఉందని ఆయన పేర్కొన్నారు. 100 శాతం విద్యుదీకరణను సాధించడం ద్వారా భారత్ ఈ దేశాలను అధిగమించనుంది. ప్రపంచంలో 100 శాతం రైల్వే విద్యుదీకరణ సాధించిన ఏకైక దేశం స్వీడన్ మాత్రమేనని.. అయితే స్వీడన్‌లో మొత్తం రైల్వే లైన్ల పొడవు భారత్‌తో పోలిస్తే దాదాపు పదిరెట్లు తక్కువని ఆయన తెలిపారు.

రైల్వే బడ్జెట్ విషయంలో గుజరాత్‌ను ఒక ఉదాహరణగా తీసుకుంటే 2009 నుంచి 2014 వరకు సగటున కేటాయించిన రైల్వే బడ్జెట్ కేవలం రూ. 589 కోట్లు మాత్రమేనని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. దీనికి విరుద్ధంగా ఒక సంవత్సరానికి అంటే 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన బడ్జెట్ రూ. 17,366 కోట్లకు చేరుకుందని ఆయన తెలిపారు. అభివృద్ధి వేగంలో ఉన్న ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. బాధ్యతారహితమైన ప్రకటనలు చేసే ప్రతిపక్ష పార్టీ నాయకులు కేవలం ఆరోపణలు మాని.. వాస్తవాలు, గణాంకాలతో చర్చించాలని దేశ ప్రజలు కోరాలని ఆయన అన్నారు. తమ హయాంలో ప్రతిపక్ష పార్టీ ఏం చేసిందని శ్రీ అమిత్ షా ప్రశ్నించారు. 10 సంవత్సరాల కాలంలో రూ. 12 లక్షల కోట్ల కుంభకోణాలు, స్కామ్‌లు, అవినీతి మినహా ప్రతిపక్ష పార్టీ చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. గత 12 ఏళ్లలో శ్రీ నరేంద్ర మోదీపై కనీసం చిన్న అవినీతి ఆరోపణ కూడా రాలేదని కేంద్ర హోం మంత్రి స్పష్టం చేశారు.

# సంగారెడ్డిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా

## -ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండాలి: కాంగ్రెస్ నాయకుల డిమాండ్

## -ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్

సంగారెడ్డి, సెప్టెంబర్ 28(నె?టినిజం ప్రతినిధి) ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ శెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు ముదిరాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా తదితరులు హాజరయ్యారు. ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత్వం, జవాబుదారీతనం ఉండాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

### ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండాలంటే ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కమిషన్‌లోనే అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వస్తున్న వార్తలపై సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా తొలగిపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి కీలకం

డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించడంతో పాటు ప్రజలకు పూర్తి సమాచారం అందించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.

### భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

ధర్నా కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, తోపాజీ అనంత కిషన్ సేట్, వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

## -శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ఫణిందర్




మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 28: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నారాయణపేట శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ఫణిందర్ అన్నారు. సోమవారం ఊట్కూర్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ పావనితో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఫణిందర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.

వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో గణేష్ రెడ్డి, డాక్టర్ సంతోషి, ఏపీఎం హరి నారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా గాంధీ పాఠశాలకు 35 డ్యూయల్ డెస్క్ బెంచీలు

## -రూ.1.46 లక్షల విలువైన బెంచీలు అందజేత



నిజామాబాద్, సెప్టెంబర్ 28: భీంగల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సౌజన్యంతో ఆయన వియ్యంకుడు, పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి అందించిన రూ.1,46,650 విలువైన 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను సోమవారం పాఠశాల యాజమాన్యానికి అందజేశారు.

విద్యార్థినులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో డెస్క్ బెంచీలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యా రంగానికి ఏనుగు దయానంద్ రెడ్డి అందిస్తున్న సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇకముందు కూడా తమ సహాయ సహకారాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్య ప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి .. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, సెప్టెంబర్ 28(నేటి నిజం ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.

సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించి, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 65 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు12 , నారాయణఖేడ్ డివిజన్‌కు 05,జహీరాబాద్ డివిజన్‌కు 05,అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని, కలెక్టరేట్‌కు 43 దరఖాస్తులు అందాయని, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్,పెన్షన్లు, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్ ,మిషన్ భగీరథ గ్రిడ్, పోలీస్,సోషల్ వెల్ఫేర్ ,సర్వే ఉ ల్యాండ్ రికార్డు , మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పి సి బి ,ఎల్ డి ఏం ,వైద్య ఆరోగ్య శాఖ .మునిసిపల్ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి . ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# షహీద్ భగత్ సింగ్ జయంతి నేపథ్యంలో ఆయనకు ప్రధానమంత్రి నివాళి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: షహీద్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఆయనకు నివాళి అర్పించారు.

అకుంఠిత దీక్ష, ధైర్యసాహసాలతో స్వాతంత్ర్య పోరాటానికి భగత్ సింగ్ కొత్త ఒరవడి దిద్దారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశ గౌరవప్రతిష్టల కోసం సర్వం త్యాగం చేసిన ఆయన స్ఫూర్తి భారత యువతరం వంనోస్థం౦రాయానికి, సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని శ్రీ మోదీ కొనియాడారు.

ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఇచ్చిన సందేశంలో:

"అమరవీరుడు భగత్ సింగ్ జయంతి నేపథ్యంలో ఆయనకు నా నివాళి. అకుంఠిత దీక్ష, ధైర్యసాహసాలతో స్వాతంత్ర్య ఎ ం ా ట ా ని క నవ్యోత్తేజమిచ్చారు. దేశ గౌరవప్రతిష్టల కోసం జీవితాన్నే త్యాగం చేయడానికి సిద్ధపడిన ఆయన సంకల్పం భారత యువతరం ధైర్యసాహసాలకు, పట్టుదలకు ప్రతీక" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# సాధన శృంఖల 2026: ప్రాంతీయ స్థాయిలో శిక్షణ సంస్థల రూపాంతరం దిశగా కొత్త కార్యక్రమం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: మిషన్ కర్మయోగి కింద శిక్షణ సంస్థలను వ్యూహాత్మక, సామర్థ్య నిర్మాణ సంస్థలుగా మార్చడానికి కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ) దేశవ్యాప్తంగా 'సాధన శృంఖల 2026' పేరుతో ప్రాంతీయ సదస్సులను నిర్వహిస్తోంది. సాధన అంటే జాతీయ అభివృద్ధి కోసం అనుకూల అభివృద్ధి, మానవీయ సామర్థ్యాలను బలోపేతం చేయడం అని అర్థం. గత ఏప్రిల్ 2 నుంచి 8 వరకు జరిగిన సాధన సప్తాహ్ 2026, మే 15న జరిగిన "సంస్థాగత సామర్థ్య పెంపుదల: శిక్షణ నుంచి పనితీరు-ఆధారిత పాలన వరకు" జాతీయ శిఖరాగ్ర సదస్సుల్లో చర్చించిన అంశాల ఆధారంగా ఈ సాధన శృంఖలను రూపకల్పన చేశారు. ఈ సాధన శృంఖల ప్రాంతీయ వర్క్‌షాప్‌లు ఒకటిన్నర రోజుల కార్యక్రమంగా రూపొందించారు. ఈ కార్యక్రమానికి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీనియర్ అధికారులు, శిక్షణ సంస్థల అధిపతులు, అధ్యాపకులు, ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు), పరిశ్రమ భాగస్వాములు, విషయ నిపుణులు, అంకుర సంస్థల ప్రతినిధులు ఒకే వేదికపైకి రానున్నారు. ఈ ప్రాంతీయ సదస్సులు సెప్టెంబర్ 29, 30 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో దక్షిణ ప్రాంత వర్క్‌షాప్‌తో ప్రారంభమవుతాయి. ఆ తర్వాత అక్టోబర్ 9,10 తేదీల్లో అస్సాంలోని గువాహటిలో ఈశాన్య ప్రాంతం, అక్టోబర్ 23, 24 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఉత్తర ప్రాంతం, నవంబర్ 16,17 తేదీల్లో (ఖరారు కావాల్సి ఉంది) మహారాష్ట్రలోని పూణేలో పశ్చిమ ప్రాంత వర్క్‌షాప్‌లు జరుగుతాయి. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో, ఆతిథ్య రాష్ట్రాల ముఖ్యమంత్రుల చేతుల మీదుగా ఈ వర్క్‌షాప్‌లు ప్రారంభమవుతాయి.

విజయవాడలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణా సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. సంస్థాగత పరివర్తనపై జరుగుతున్న జాతీయ చర్చను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చడానికి, కార్యాచరణలోకి తీసుకురావడానికి ఈ సాధన శృంఖల ఆయా ప్రాంతాలకు తీసుకెళ్తోంది. శిక్షణ సంస్థలు కేవలం శిక్షణ ఇచ్చే సాధారణ సంస్థల నుంచి వ్యూహాత్మక, నైపుణ్య ఆధారిత సామర్థ్య నిర్మాణ సంస్థలుగా మారడానికి ఒక సమగ్ర మార్గదర్శక వ్యవస్థ అవసరమని గతంలో జరిగిన చర్చలు స్పష్టం చేశాయి.

వివిధ రాష్ట్రాలు, శిక్షణ సంస్థలు, ఇతర భాగస్వామ్య వర్గాలను భాగస్వాములను చేస్తూ, వివిధ సంస్థల అవసరాలకు శిక్షణ సంస్థలను సామర్థ్య నిర్మాణ సంస్థలుగా తీర్చిదిద్దడమే ఈ ప్రాంతీయ వర్క్‌షాప్‌ల ప్రధాన ఉద్దేశం. ఇందులో సామర్థ్య నిర్మాణ ప్రణాళికలు (సీబీపీలు) కీలకంగా ఉంటాయి. ప్రభుత్వంలో వివిధ బాధ్యతలు నిర్వహించే సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా సంస్థలు చేపట్టాల్సిన చర్యలను ఈ ప్రణాళికలు నిర్దేశిస్తాయి. "సరైన పాత్రకు, సరైన సమయంలో, సరైన సామర్థ్య నిర్మాణం" అందించడమే దీని లక్ష్యం. ఈ సమావేశాల్లో సంస్థల పాలన, నాయకత్వాన్ని మెరుగుపరిచే విధానాలు, సంస్థల పనితీరు, పరస్పర సహకారం, కర్మయోగి నాణ్యతా విధానానికి (కేక్యూఎఫ్) అనుగుణంగా శిక్షణ నాణ్యతను పెంచడం, బోధకులు, సిబ్బంది నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, డిజిటల్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను క్రమబద్ధంగా వినియోగించడం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి.

ఈ సంస్థాగత పరివర్తన అమలును ఏకీకృత నూతన తరం జాతీయ శిక్షణా కార్యక్రమం (యూఎన్ఎన్ఏటీఐ- ఉన్నతి) వేదిక ద్వారా ముందుకు తీసుకెళ్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 900కు పైగా శిక్షణ సంస్థలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం ద్వారా, ఈ ఫ్రేమ్‌వర్క్ లక్ష్యాలను ఉన్నతి వేదిక ఆచరణలోకి తెస్తుంది.

# ఫాదర్ ఆఫ్ కెమటాలజీ.. కొలచల సీతారామయ్య

కొలచల సీతారామయ్య (జూలై 15, 1899 - సెప్టెంబరు 29, 1977) ఆయిల్ టెక్నాలజీ పరిశోధక నిపుణులు. యంత్రాలు, వాహనాలలో యంత్ర భాగాల ఘర్షనను నిరోధించే కందెనలు (లూబ్రికెంట్స్) మీద పరిశోధనలు చేసి కెమటాలజీ (మోటారు ఆయిల్స్, కందెనలకు సంబంధించిన రసాయన శాస్త్రము) కు పునాది వేసిన రసాయన శాస్త్రవేత్త. ఆయనను ఫాదర్ ఆఫ్ కెమటాలజీ అంటారు.

ఆయన కృష్ణా జిల్లా లోని ఉయ్యూరు గ్రామంలో జన్మించారు. ఆయన జాతీయ భావాలు గల మధ్య తరగతి కుటుంబంలో జూలై 15 1899లో జన్మించారు. మదనపల్లె నేషనల్ కాలేజి (చిత్తూరు) రసాయన శస్త్రాధ్యయనం చేశారు. 1921 లో మద్రాసు విశ్వ విద్యాలయం గ్రాడ్యుయేట్ స్కూల్ లో ప్రవేశించారు. 1924 జూన్ 10 వ తేదీన రసాయన శాస్త్రంలో ఆయనకు మాస్టర్స్ డిగ్రీ ప్రదానం జరిగింది. స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా జరుగుతున్న కాలంలో ఆస్తినంతటినీ అమ్మివేసి అమెరికా వెళ్లారు. చికాగో యూనివర్శిటీకి వెళ్ళి ఆయిల్ టెక్నాలజీలో పరిశోధన చేశారు. అతి ప్రామాణికమైన సిద్ధాంత రూపకల్పన చేసి పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ అందుకున్నారు.

పెట్రోకెమికల్ రంగంలో ప్రైవేటు కంపెనీలో 1925 నుండి 1927 దాకా అమెరికాలో పనిచేశారు. ఆ కాలంలో న్యు హెవెన్ లో గల కంపెనీ ప్రయోగశాలకు ఆయన అధిపతిగా ఉండేవారు. అదే కాలంలో మెల్ విశ్వవిద్యాలయం నుండి డిగ్రీని పొందారు. సానెబాల్స్ సంస్థలో పనిచేసిన కాలంలో లూబ్రికెంట్ ల నాణ్యతను పెంచే ఉత్పత్తులను కనుగొన్నారు. ఈ పరిశోధనల ఫలితాలన్నింటికి పేటెంట్ హక్కులు లభించిన ఖ్యాతి సీతారామయ్యకు దక్కింది.

1930 డిసెంబర్ 17 న కోలాచల సీతా రామయ్య సోవియట్ యోనియన్ రాజధాని మాస్కో నగరం చేశారు. అనతి కాలంలోనే భూ పరిశోధకునిగా ప్రసిద్ధి పొందిన ఒక విద్యావేత్త అయిన "గుచికిక్"తో పరిచయం యేర్పడింది. ఆయన రష్యా ప్రభుత్వ ఆయిల్ రీసెర్చి ఫౌండేషన్ డైరక్టరు. ఆ దేశంలోని వోల్గా ప్రాంతం నుంచి ఉరల్స్ ప్రాంతం వరకు గల భూగర్భంలో నూనె నిల్వలు అపరిమిత స్థాయిలో ఉన్నట్లు సీతా రామయ్యకు తెలుపుతూ పరిశోధనలలో తనకు సహకరించ వలసినదిగా పోత్సహించారు. సీతారామయ్యకు గల ఆయిల్ కెమికల్ సైన్సు రంగంలో ఉన్న పరిశోధనానుభవం, కృషి సాఫల్యతల గూర్చి తెలుసుకొన్న గుచికిక్ మరింత మద్దతునిచ్చి, దేశ పౌరసత్వాన్ని లభింపజేసి, ఆయిల్



టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ లోని లూబ్రికెంట్స్ రీసెర్చి డివిజన్ కు డైరక్టరుగా నియమింప జేశారు. ఆ పరిణామం సీతారామయ్య పరిశోధనా జీవితాన్ని వ్యక్తిగత జీవితాన్ని సమూలంగా మార్చివేసింది. ఆయన పేరు "కాన్‌స్తాంతిన్ సెర్లియేవిచ్"గా రూపాంతరం చెందింది. రష్యనుగా మారి, జీవితంలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. సోవియట్ రష్యా దేశంలోని ఆయిల్ వనరులు ఉన్న ఆయిల్ రిఫైనరీస్ ఉన్న ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక విధానాలను ప్రవేశపెట్టడానికి అధ్యయనాలు నిర్వహించి కృషిచేశారు. అనతి కాలంలోనే ఆ ప్రభుత్వ గుర్తింపు పొందారు. ఆటోమొబైల్, మోటార్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లోని ఆయిల్ రీసెర్చి డివిజన్ కు హెడ్ గా నియమితులయ్యారు.

ఆఐఔంఓఎ అనే పేరుతో క్రొత్త పరికరాన్ని తయారు చేయడం. తర్వాత మీడియా సిద్ధాంతం ఆవిష్కరణ, తర్వాత కాలంలో సైన్స్ లో కొత్త అధ్యాయం ఆరంభమైంది.

కొంతకాలం గడిచిన తర్వాత దానికి కెమోటాలజి అనే ఒక ప్రత్యేకమైన పేరు వచ్చింది. రామయ్య పరిశోధనలతో లూబ్రికంట్ చరిత్రలో విప్లవమే వచ్చింది. అందుకే రామయ్య "కెమోటాలజీ పితామహుడు" అయ్యారు.

అన్ని రకాల శీతోష్ణస్థితిలో సమర్ధవంతంగా పని చేసే ప్రత్యేక కిరోసిన్ ఇంధనాన్ని తయారు చేశారు. ఎటువంటి ప్రతికూల వాతావరణంలో నైనా యుద్ధ ట్యాంకులు నిలిచి పోకుండా ఉండేందుకు ఆయన కనుగొన్న ఇంధనం రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ మిత్రకూటమి విజయ పరంపరలో కీలకమైనది. టాంక్ యుద్ధాలలో విజయాలను అందుకునేలా చేసింది. అనతి కాలంలోనే ఆయన ప్రముఖ శాస్త్రవేత్తగా అఖండ కీర్తినార్జించడమే కాక ఆటోమొబైల్స్, మోటార్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ విభాగాధిపతిగా నియమింప బడ్డారు.

ఆయనకు సాహిత్యంలో కూడా ప్రవేశం ఉంది. ఏటుకూరి బలరామమూర్తి రాసిన "ఏ బ్రీఫ్ సర్వే ఆఫ్ ద హిస్టరీ ఆఫ్ ద పీపుల్ ఆఫ్ ఆంధ్ర" అనే పుస్తకాన్ని రామయ్య రష్యన్ భాషలోకి అనువదించారు.

చాలా ఏళ్ళ అనంతరం 1963 లో ఏప్రెల్ 22 నుండి జూన్ 5 వరకు 42 రోజులు మాతృ దేశమైన భారత్ లో గడిపి తిరిగి రష్యా చేరుకున్నారు సీతా రామయ్య. తాను రష్యా కు, భారత దేశంకు చెందిన ఉమ్మడి పౌరుడిని అని చెప్పుకుని గర్వ పడేవారు. రష్యాలో ఆయనను ఆంధ్రా సీత రామయ్య అంటే... భారతదేశంలో ఆయన్ను రష్యా సీతా రామయ్య అనే వారు. తీవ్రమైన న్యుమో నియాతో బాధపడి 1977 సెప్టెంబర్ 29 న తన 78 వ ఏట మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## కరీంనగర్‌లో ఘనంగా 'శాతవాహన గ్రామీణ సంత' ప్రారంభం..

### స్వదేశీ ఉత్పత్తులు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 40 స్టాల్స్‌తో ఏర్పాటు



కరీంనగర్, సెప్టెంబర్ 28: (నేటినిజం ప్రతినిధి) స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ , ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సోమవారం రోజున కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో 'శాతవాహన గ్రామీణ సంత' ఘనంగా ప్రారంభమైంది. గ్రామ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గ్రామీణ సంత నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో వివిధ రకాల గ్రామీణ ఉత్పత్తులతో కూడిన మొత్తం 40 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చేనేత వస్త్రాలు, సేంద్రియ (ఆర్గానిక్) ఆహార పదార్థాలు, మట్టి పాత్రలు, హస్తకళలు, మూలికా ఆరోగ్య ఉత్పత్తులు ఈ సంతలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇట్టి ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా, ప్రధాన వక్త గా హాజరైన జిల్లా సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విక్రమ్ సింగ్ ఠాకూర్ లు మాట్లాడుతూ దేశీయ ఉత్పత్తులను ఆదరించడం ద్వారా స్థానిక చేతివృత్తుల వారికి, గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు..నేటి ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో రసాయనాలకు దూరంగా ఉంటూ, ప్రకృతి సిద్ధమైన స్వదేశీ వస్తువులను వాడటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం, పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఇలాంటి పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ గ్రామీణ సంత కరీంనగర్ ప్రజలకు నూతన అనుభూతిని పంచుతుందని, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేసి గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత గ్రామ వికాస్ సంయోజక్ జిన్నా సత్యనారాయణ రెడ్డి , సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ శంకరయ్య , గ్రామ భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ గాలి పెల్లి నాగేశ్వర్ , ప్రధాన కార్యదర్శి కూర్మాచలం మునిందర్ , ఉపాధ్యక్షులు క్యాస మధు , కార్యదర్శి గొల్లె తిరుపతి శివనాథుల స్వప్న , గ్రామ వికాస్ జిల్లా సంయోజక్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు


## చదువుతోనే సమాజంలో గౌరవం

### - ఉజ్వల భవిష్యత్తు కౌన్సిలర్ శ్రీతూము మధు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): చదువుతోనే సమాజంలో గౌరవం, ఉజ్జల భవిష్యత్తు ఉంటుందని 14వవార్డ్ కౌన్సిలర్ తూముమధు అన్నారు. మంగళవారంప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ స్వంత ఖర్చులతో విద్యార్థులకు టై,ఐడి కార్డ్స్ , బెల్టులను తెప్పించి, కౌన్సిలర్ తో మధు గారిచే విద్యార్థులకు వితరణ చేయనైనది. ఈ సందర్భంగా కౌన్సిలర్ తూమ్ మధు మాట్లాడుతూ "ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ టై, ఐడి కార్డ్స్, బెల్టులను వితరణ చేయుడం ప్రశంసనీయమని, చదువు ద్వారా లోకజ్ఞానం, విచక్షణా జ్ఞానం పెరుగుతాయని, నాణ్యమైన విద్య మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిస్తుందని, విద్య మనిషికి ఆత్మవిశ్వాసాన్ని, మంచి ప్రవర్తనను నేర్పుతుందని, కుటుంబంలో ఆర్థిక భద్రత ఏర్పడి, పేదరికం తొలగిపోవడానికి చదువే మొదటి మెట్టు అని, చదువుకున్న వారితోనే సమాజంలో సమానత్వం, శాంతి మరియు దేశ అభివృద్ధి సాధ్యమవుతాయని, ఉజ్వల భవిష్యత్తు కోసం విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, చదువులో రాణించి తమ ఉజ్వల భవిష్యత్తు కోసం ఉన్నతంగా ఎదగాలని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, నాయకుడు భాస్కర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వేములవాడ కాంగ్రెస్ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): :వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ రజాక్ నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు రియాజ్ చేతుల మీదుగా అబ్దుల్ రజాక్ నియామక పత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా, ముస్లిం మైనార్టీ వర్గాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న అబ్దుల్ రజాక్‌ను వేములవాడ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు రియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, మాజీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు తన నియామకానికి సహకరించిన మైనార్టీ నాయకులు, పార్టీ శ్రేణులందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అబ్దుల్ రజాక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ నాయకులుమహమ్మద్ షాహిద్ పాష. మొహమ్మద్ సోహెల్ ఖాన్. మహమ్మద్ ఫసి ఉద్దీన్. సయ్యద్ షబ్బీర్. ఎదురుగట్ల రాము. మరియు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్‌గా వేములవాడకు చెందిన షాహిద్ పాషా నియామకం

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28:రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా మొహమ్మద్ షాహీద్ పాషా నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్ చేతుల మీదుగా షాహీద్ పాషా నియామక పత్రాన్ని అందుకున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు షాహీద్ పాషాకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. జిల్లా మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. తనపై నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించినందుకు షాహీద్ పాషా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం సూచనల మేరకు మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ రియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మధు, వ్యవసాయమార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కనికరపు రాకేష్. తో పాటు తనకు సహకరించిన మైనారిటీ నాయకుల కు పార్టీ నాయకులకు షాహీద్ పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రజాక్. మహమ్మద్ సోహెల్ ఖాన్. మహమ్మద్ పసి ఉద్దీన్. తదితరులు పాల్గొన్నారు

## నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం జరిగే వరకూ ఉద్యమాలకు సిద్ధం కావాలి



ములుగు, సెప్టెంబర్ 28:(నేటినిజం ప్రతినిధి): ఈరోజు ములుగు జిల్లా కేంద్రంలోని ాఅకాంప్లెక్స్ ఆవరణలో నాయీబ్రాహ్మణ సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు వేల్పుకొండ శరబందం అధ్యక్షతన జరిగినది ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల సత్యనారాయణ మాట్లాడుతూ, జిల్లా కేంద్రం తోపాటు ఏటూరునాగారం, మేడారం లో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేపట్టాలని, మేడారం జాతరలో 2004 అగ్రిమెంట్ అమలుచేయాలని డిమాండ్ చేసారు హక్కులు అమలు జరిగే వరకూ ఉధ్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు, ఈ సమావేశంలో సంఘం మండల సభ్యులు,ముత్యాల రాజు చెన్న సాంబయ్య, చిక్కుల స్వామి, సముద్రాల రమేష్, జంపాల శ్రీనివాస్,మురహరి రామకృష్ణ, నరేందర్, వెంకటస్వామి, మరియు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్న కుమార్, జిల్లా అధ్యక్షులు చిక్కల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రకాష్

## మత్తుకు దూరంగా.. భవితకు బాటగా!

### నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేసిన రాయపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



వరంగల్, సెప్టెంబర్ 28: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని రాయపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయకుమారి విద్యార్థులకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా జయకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశలో అలవడే మంచి అలవాట్లే జీవితానికి పునాది అవుతాయని అన్నారు. మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యంతో పాటు చదువు, కుటుంబం, భవిష్యత్తుపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. క్షణిక ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు వాటి వల్ల కలిగే అనర్థాలను తోటి విద్యార్థులు, యువతకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కష్టపడాలని సూచించారు. యువతలో చైతన్యం పెరిగితే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.

అనంతరం విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వాటి బారిన పడకుండా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి ఆలోచనలు, క్రమశిక్షణతో ముందుకు సాగాలని ప్రతినబూనారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.